జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 17 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 174 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 10:34:59 వరకు నక్షత్రంమాఘ - 14:05:10 వరకు కరణంశకుని - 10:34:59 వరకు, చతుష్పాద - 21:43:34 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 19:17:38 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## షహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం..

**ఉగ్రసంస్థగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**
**పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఎస్‌బీఎన్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న షహజాద్ భట్టి నెట్‌వర్క్‌ను (ఎస్‌బీఎన్) కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) సెక్షన్ 35 కింద కేంద్ర హోంశాఖ బుధవారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయంతో

మిగతా 2లో..

## న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం

**భారత్‌తో భారీ డీల్ కుదుర్చుకున్న న్యూజిలాండ్**
**95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గించే చాన్స్!**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): భారత్–న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్

మిగతా 2లో..



# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

- యూఎల్‌సీ భూములపై త్వరలో కొత్త విధానం
- 22ఏ సమస్యల్లో 12 అంశాలను గుర్తించాం
- పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తాం
- పొరపాటున 22ఏలో చేరిన భూములు తొలగిస్తాం
- క్రమబద్ధీకరించిన, వేలం భూములకు విముక్తి
- ధరణి పేరిట గత ప్రభుత్వంలో దోపిడీ జరిగింది
- రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది
- బీఆర్ఎస్ భూములను ఇష్టారాజ్యంగా బదిలీ
- కేసీఆర్ ఫాంహౌస్ భూములపై విచారణ చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి
- ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంచుతాం
- ఫాంహౌస్ భూములపై 30 రోజుల్లో నివేదిక
- శాసనసభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): 22ఏ భూముల సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనుంది. 22ఏ సమస్యల్లో 12 రకాల అంశాలను గుర్తించామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. యూఎల్‌సీ భూముల విషయంలో త్వరలో కొత్త విధానం తీసుకొస్తామని చెప్పారు. అధీకృత లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామని సీఎం ప్రకటించారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు ఉన్న లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు కూడా చేస్తామన్నారు. ఇకపై 22ఏ జాబితాలో భూమిని చేర్చడం, తొలగించడం కోసం స్పష్టమైన నిబంధనలు తీసుకొస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. పొరపాటున వ్యక్తిగత భూములు 22ఏ జాబితాలో చేరితే కలెక్టర్లు, ఆర్డీవోలు వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను నిషేధిత జాబితా నుంచి

మిగతా 2లో..

> "సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు ఉంది. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు ఉంది. జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉంది. నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాలోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి"
> - రేవంత్ రెడ్డి, సీఎం



## సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్..

- పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తాం
- సింగపూర్ ప్రతినిధులతో సీఎం కీలక భేటీ
- సుముఖత వ్యక్తం చేసిన సింగపూర్ బృందం

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ

మిగతా 2లో..

# సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా..?



- సిట్టింగ్ జడ్జీతో ఎంక్వైరీ చేయిద్దామా..?
- నీ ఆస్తులు.. మా ఆస్తులపై ఎంక్వైరీ వేద్దాం
- మా ఆస్తులు, రేవంత్ రెడ్డి ఆస్తులపై సిద్ధం
- చర్చలో 22ఏపై క్లారిటీ వస్తుందనుకున్నాం
- నీ కుంభకోణాలన్నీ బయటకొస్తాయనే సస్పెండ్
- ఆరు గ్యారంటీల అమలులో నువ్వు విఫలం
- అవ్వాతాతలు రూ.4 వేలు ఎగ్గొట్టింది నిజం
- మహిళలకు రూ.2500 ఎగ్గొట్టింది నిజం కాదా?
- రేవంత్ రెడ్డి డైవర్షన్ డ్రామాకు దిగుతున్నారు
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): చర్చ ద్వారా 22ఏకు ఒక క్లారిటీ వస్తదేమో అని అనుకున్నాం.. కానీ రేవంత్ రెడ్డి యూఎల్‌సీ భూముల మీద న్యూ పాలసీ గైడ్ లైన్స్ ఇస్తా అంటడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. .. హెచ్ఎండీఏ, డీటీసీపీ లే అవుట్లు ఓ వారం రోజుల్లోపు వ్యవస్థ తెస్తాం.. జిల్లా స్థాయిలో కమిటీ వేస్తాం. జీవో 118 ఎల్‌బీ నగర్ దానిపై పరిశీలిస్తాం. ఆలోచిస్తం.. లీగల్‌గా పరిష్కరిస్తాం. విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతం. ఫీజులు కట్టించుకుంటం.. గైడ్ లైన్స్ ఇస్తం.. హైపవర్ కమిటీ వేస్తం.. ఇవే చెప్పిండు. నీ ఇల్లు మాత్రం తీసుకున్నవ్.. నీ ఇల్లుకు ఏ హైపవర్ కమిటీ లేదు.. లీగల్‌గా ఆలోచించేది లేదు. కమిటీ వేసేది లేదు.. పరిష్కరించేది లేదు. ఇవన్నీ రేవంత్ రెడ్డి చెప్పినవేనన్నారు. ఇయ్యాళ్ల కేటీఆర్ మీద.. నా మీద, మా నాయకుల మీద ఇన్ని ఆరోపణలు చేశావు కదా..బీఆర్ఎస్ హయాంలో ధరణి విషయంలో కావొచ్చు. లేదు కాంగ్రెస్ వచ్చిన డిసెంబర్ 7 2023 నుంచి

మిగతా 2లో..

## 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

**అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పే హరీశ్‌రావు మామ భూములకు ఎలా జరిగింది? అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది హరీష్? రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫైర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ప్రశ్నించారు. "అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి

మిగతా 12లో..



## దానం అనర్హతపై విచారణ వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టులో కీలక వాదనలు జరిగాయి. దానం బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరటం పైన హైకోర్టులో దాఖలైన పిటీషన్ ను న్యాయస్థానం విచారణ చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ–ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో కీలకంగా మారింది. ఈ పిటీషన్ ను విచారణ చేసిన న్యాయస్థానం ఈ రోజు తీర్పు వెల్లడించాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదా వేసింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి

మిగతా 12లో..

## సంగారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి
నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో వినాయక నిమజ్జనంలో అపశ్రుతి చోటుచేసుకుంది. గణేశ్ నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఆరుగురు పిల్లలు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో చోటుచేసుకుంది. కాగా మృతులంతా శిరీష ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తించారు. ఒక్కసారిగా ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

**కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం**
**51 లక్షల మంది లబ్ధి పొందే చాన్స్**




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): దేశంలో పనిచేస్తున్న కోట్లాది మంది వేతన జీవులకు కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన వార్త అందించింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పరిధిలోకి వచ్చే సేవకుల వేతన పరిమితిని భారీగా పెంచుతూ కేంద్ర కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ. 15,000 ఉన్న ఈ పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితిని ఏకంగా రూ. 25,000కు పెంచుతూ కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఈ సంచలన నిర్ణయాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి

మిగతా 12లో..

# ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ ఆయుధ ప్యాకేజీ

రూ. 26వేల కోట్ల విలువైన ఆయుధాలు సరఫరా!
40వేల అత్యంత శక్తిమంతమైన భారీ బాంబులు
ఇజ్రాయెల్‌తో అమెరికా రహస్య సమావేశం!
ఏడు అరబ్ దేశాల సైనికాధికారులతో భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో ఇరాన్– అమెరికా ఘర్షణ వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్‌కు 2.8 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ.26 వేల కోట్లు) ఆయుధ ప్యాకేజీని అమెరికా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆయుధ ప్యాకేజీలో ఒక్కొక్కటి 900కిలోల బరువున్న 40,000 బాంబులు ఉండనున్నట్లు సమాచారం. ప్రతిపాదిత ప్యాకేజీలో 20,000 వీఖ–84 బాంబులు, 20,000 దీూఖ–117 బాంబులతో పాటు

మిగతా 12లో..

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

రేవంత్ రెడ్డి, సండ్ర పిటిషన్లపై సుప్రీంలో విచారణ

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఓటుకు నోటు' కేసుపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఈరోజు విచారణ జరిగింది. తెలంగాణ

మిగతా 12లో..

## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

**కొత్త ఎండీఆర్ విధానంపై ఫోన్‌పే సీఈఓ క్లారిటీ**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ స్పష్టం చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ఆర్థికంగా నిలకడగా కొనసాగించేందుకు కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధానం అవసరమని చెప్పారు. ఈ విధానం వల్ల కస్టమర్లపై అదనపు భారం పడదన్నారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సమీర్ నిగమ్ ఈ వివరాలు వెల్లడించారు. వ్యక్తి

మిగతా 12లో..



# సూడాన్ కుప్పకూలిన బంగారు గని..

82 మంది మృతి, డజన్ల కొద్దీ గల్లంతు

సూడాన్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): సూడాన్ లోని ఓ మారుమూల ప్రాంతంలో బంగారు గని కుప్పకూలింది. ఈ ప్రమాదంలో 82 మంది మృతి చెందారు. వెస్ట్ కొర్డోఫాన్ ప్రావిన్స్ లోని నుహుద్ టౌన్ లో ఉన్న అల్– జరా గోల్డ్ మైన్ లో ఈ విషాద ఘటన జరిగింది. ఈ గోల్డ్ మైన్ ను పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్( దళాల ఆధీనంలో ఉంది. ఈ దళం సూడాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మూడేళ్లకు పైగా యుద్ధం చేస్తోంది. ఈ ఘటనపై ది సూడాన్ డాక్టర్స్ నెట్ వర్క్ స్పష్టం చేస్తూ.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ గోల్డ్ మైన్ ను చట్ట పరంగా కాకుండా రెగ్యులర్ కార్మికులతో కాకుండా స్థానికులతో తవ్వకాలు జరుపుతున్నారని అలాగే ఆ గని వద్ద ఎలాంటి భద్రతా పరికారాలు, ముందస్తు రక్షణ చర్యలు లేవని పేర్కొంది. మరోవైపు

# సంపాదకీయం

## ప్రపంచ దేశాలు చొరవ తీసుకోవాలి

ప్రపంచవ్యాప్తంగా నేడు జరుగుతున్న యుద్ధాలపై ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఈ యుద్ధాలవల్ల ప్రపంచం మొత్తం ఆర్థిక సంక్షోభం లోకి నెట్టింది. నేడు పలు దేశాల మధ్య యుద్ధాల వల్ల అన్ని దేశాలలో నిత్యావసర ధరలు ఎగిసిపడుతున్నాయి. వాస్తవానికి యుద్ధాలు మానవాళికి అపారమైన నష్టాన్ని మిగిల్చాయి. మొదటి ప్రపంచ యుద్ధంలో కోట్లాది మంది సైనికులు, ప్రజలు మరణించారు. రెండో ప్రపంచ యుద్ధంలో అణుశక్తి, సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మరింత భయంకరమైన విధ్వంసం జరిగింది. దాదాపు ఎనిమిది కోట్ల మంది ప్రాణ నష్టం, లక్షల కోట్ల ధన నష్టం జరిగింది. దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలాయి. అయినా, ప్రపంచానికి శాశ్వత శాంతి లభించలేదు. లీగ్ ఆఫ్ నేషన్స్, ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి వంటి సంస్థలు ఏర్పడినా ప్రపంచంలో యుద్ధాలు ఆగలేదు. సామ్రాజ్యవాదం, ఆర్థిక ఆధిపత్యం, మతపరమైన విద్వేషాలు, పరోక్ష యుద్ధాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం కొరియా, వియత్నాం యుద్ధాలు కూడా లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నాయి. పాలస్తీనా--ఇజ్రాయెల్ ఘర్షణలు, ఉక్రెయిన్ యుద్ధం వంటి సంఘటనలు ప్రపంచాన్ని అశాంతి వైపు నెడుతున్నాయి. గతం నుంచి పాఠాలు నేర్చుకోవడంలో మానవజాతి విఫలమవుతోంది. కళింగ యుద్ధానంతరం పశ్చాత్తాపం చెందిన అశోకుడు.. ప్రజల సంక్షేమం, శాంతి, అభివృద్ధి కోసం కృషి చేశాడు. ప్రస్తుతం ప్రపంచంలో అలాంటి పరివర్తన ఎంతవరకు కనిపిస్తోంది?! వసుధైవ కుటుంబకంలో ప్రపంచమంతా ఒక కుటుంబమే. అయినప్పటికీ, ఆధిపత్య ధోరణులు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులు, మతపరమైన ద్వేషాన్ని రెచ్చగొట్టే వర్గాలు యుద్ధానంతర సమాజ దుస్థితిని మరిచిపోతున్నాయి. అణ్వాయుధాలు, ఖండాంతర క్షిపణులు, అపారమైన ఆయుధ సంపత్తి శాంతిని తీసుకురాలేవు. అదే సంపదను పేదరికం, ఆకలి, వైద్యం, విద్య కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సంతోషంగా మారుతుంది. యెమెన్, సూడాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల్లో ప్రజలు నేటికీ ఆకలి, నిరాశ్రయం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. మానవాళిపై దయ, ప్రేమ, సహానుభూతి పెరిగినప్పుడే సుస్థిర శాంతి సాధ్యమవుతుంది. శాంతి చర్చలు కేవలం రాజకీయ ప్రయోజనాలకే పరిమితం కాకుండా మానవ సంక్షేమానికి దారి తీయాలి. ప్రపంచ శాంతి స్థాపనలో భారతదేశం తన సాంస్కృతిక వారసత్వం, అహింసా సిద్ధాంతం, “వసుధైవ కుటుంబకం” భావనల ద్వారా మార్గదర్శకత్వం వహించాలి. మరోవైపు పశ్చిమాసియాలో ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం అమెరికాకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. 2026 ఆగస్టు నాటికి అమెరికా రక్షణ శాఖ ఈ యుద్ధం కోసం సుమారు 38 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3.65 లక్షల కోట్లు) మేర ఖర్చు చేసినట్లు కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) తాజా నివేదికలో పేర్కొంది. ఒక వేళ యుద్ధం తీవ్రత జులై నాటి స్థాయికి పెరిగితే, అమెరికా నెలవారీ యుద్ధ ఖర్చు 3 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని హెచ్చరించింది.సీబీఓ అనేది అమెరికా కాంగ్రెస్‌కు, బడ్జెట్, ఆర్థిక విశ్లేషణలు అందించే ఒక నిష్పాక్షిక సంస్థ. ఇది తాజాగా “ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యల ఖర్చు అంచనా” అనే పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. అందులో ఇరాన్‌తో యుద్ధానికి సంబంధించిన ఖర్చులను నాలుగు విభాగాలుగా చూపించింది. అవి ఏమిటంటే? రక్షణ శాఖ కార్యకలాపాలు, రవాణా, నిర్వహణ ఖర్చులు; ఆర్కౌట్ ఖర్చులు (ఒకదాని కోసం కేటాయించినవి మరొకదానికి వాడడం వల్ల కలిగే నష్టం); సరఫరా అంతరాయాలు, ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు; దౌత్యపరమైన చర్యలు, విదేశీ సాయం వంటి అదనపు ఖర్చులు. “అమెరికా రక్షణ శాఖ ఖర్చు చేసిన 38 బిలియన్ డాలర్లలో ఎక్కువ భాగం, యుద్ధంలో వాడేసిన మందుగుండు సామగ్రిని, నష్టపోయిన ఆయుధాలను మళ్లీ భర్తీ చేసుకోవడానికి ఖర్చు అయ్యింది. యుద్ధ విమానాల మోహరింపు, ఇంధనం ఖర్చు కూడా ఇందులో భాగంగా ఉంది. వాస్తవానికి యుద్ధం ప్రారంభమైన మొదట్లో ఘర్షణలు చాలా తీవ్రంగా జరిగాయి. ప్రస్తుతం తక్కువ తీవ్రతతో నామమాత్రంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకవేళ మే, జూన్ నెలల తరహాలోనే మళ్లీ ఘర్షణలు తీవ్రమైతే, అమెరికా అదనంగా నెలకు 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.19.182 కోట్లు) ఖర్చు అయ్యే అవకాశం ఉంది. అదే ఈ ఘర్షణలు జులై నాటి తీవ్రతకు పెరిగితే ఆ ఖర్చు నెలకు 3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.28,773 కోట్లు)కు చేరుతుంది. యుద్ధం తీవ్రత మరింత పెరిగితే ఆ ఖర్చులు ఇంకా పెరగవచ్చు. రక్షణ శాఖ మాకు అవసరమైన సమాచారాన్ని అందించకపోవడం వల్ల, ప్రభుత్వ డేటాబేస్లు, బహిరంగ నివేదికల ఆధారంగా ఈ అంచనాలు వేశాం” అని సీబీఓ పేర్కొంది. జూన్‌లో ట్రంప్ ప్రభుత్వం 87.6 బిలియన్ డాలర్ల అదనపు నిధులు కోరింది.అందులో రక్షణ శాఖకు సంబంధించినవే 67.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో ఇరాన్‌తో యుద్ధానికి కేటాయించినవి 42.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇది సీబీఓ అంచా వేసిన ఖర్చు కంటే 10 శాతం ఎక్కువ కావడం గమనార్హం.క్షిపణి రక్షణ వ్యవస్థల వాడకం భారీగా పెరగడం వల్ల అమెరికా వద్ద మిస్సైల్స్ నిల్వలు భారీగా తగ్గిపోయే ప్రమాదం ఉందని సీబీఓ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా సైన్యానికి ఇది ఇబ్బందికర పరిణామమేనని స్పష్టం చేసింది. ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల హర్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం ద్వారా జరిగే చమురు, సహజవాయువు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు, పెట్రోల్, డీజిల్, జెట్ ఫ్యూయెల్ ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఇంధన ధరల పెరుగుదల వల్ల 2027 మొదటి త్రైమాసికంలో వినియోగ వస్తువుల ధరలు (పీసీఈ) ద్రవ్యోల్బణం మునుపటి అంచనాల కంటే 0.5 శాతం, కోర్ పీసీఈ ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర పెరగవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ట్రెజరీ వడ్డీ రేట్లపై కూడా పడే అవకాశం ఉందని, 2026లో మూడు నెలల ట్రెజరీ బిల్లు రేట్లు 0.2 శాతం వరకు పెరగవచ్చని సీబీఓ అంచనా వేసింది. అయితే దౌత్యపరమైన చర్యలు, విదేశీ సహాయానికి అయ్యే అదనపు ఖర్చులను ఇప్పుడే కచ్చితంగా అంచనా వేయలేమని, అది యుద్ధ ముగింపుపై ఆధారపడి ఉంటుందని సీబీఓ పేర్కొంది. ఏదేమైనా ఈ యుద్ధాలు త్వరగా ముగిసిపోతే తప్ప ప్రజలకు కాస్త ఉపశమనం లభించదు. ఆ దిశగా ప్రపంచ దేశాలు చొరవ తీసుకొని యుద్ధాలు జరిగే దేశాల మధ్య సంధి కుదిర్చి మరింత ఆర్థిక సంకోభంలోకి వెళ్ళకుండా చూడాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# 22ఏ భూములకు త్వరలో పరిష్కారం

మొదటిపేజీ తరువాయి..

తొలగిస్తామని తెలిపారు. జీవో 166, జీవో 59, జీవో 58 కింద క్రమబద్ధీకరించిన భూములకు కూడా ఇది వర్తిస్తుందన్నారు. వేలంలో కొనుగోలు చేసిన భూములు, బ్యాంకుల్లో తనఖా పెట్టి వేలం వేసిన భూములను కూడా 22ఏ జాబితా నుంచి తొలగిస్తామని చెప్పారు. ధరణి వ్యవస్థపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సీఎం విమర్శించారు. నీటి ప్రాజెక్టుల తర్వాత కేసీఆర్ దృష్టి భూములపై పడిందని ఆరోపించారు. భూదోపిడీ ఆలోచనల నుంచే ధరణి పుట్టిందన్నారు. కేసీఆర్, సోమేశ్‌కుమార్ కలిసి ధరణిని రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిందన్న ఆరోపణలపైనా రేవంత్ స్పందించారు. అసలు వివాదం 3.73 లక్షల ఎకరాల ప్రైవేట్ పట్టా భూముల గురించేనన్నారు. వాటిని చూపించి కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారంటూ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025లో నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచామని సీఎం తెలిపారు. ప్రాజెక్టుల్లో అవినీతి తర్వాత కేసీఆర్ కన్ను భూములపై పడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. భూ దోపిడీ గురించి చేసిన ఆలోచనల నుంచే ధరణి అనే పురుగు పుట్టిందని, అదే భూతమై సమాజాన్ని పట్టి పీడిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. కోట్ల ఎకరాల భూములకు సంబంధించిన డేటా మాఫియా చేతిలో బీఆర్ఎస్ నాయకులు పెట్టారని ఆరోపించారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ధరణిపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్, సోమేశ్ కుమార్ తమ మెదడు రంగరించి ధరణి తయారు చేశామని గొప్పలు చెప్పారని, ఆయన చెప్పింది పచ్చి అబద్ధమని సీఎం మండిపడ్డారు.ధరణి పోర్టల్ ద్వారా బీఆర్ఎస్ నేతలు భూములను ఇష్టానుసారం బదిలీ చేసుకున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తప్పు చేసిన వారు సభకు రాకుండా తప్పించుకుందామనే చూస్తారని సీఎం ఎద్దేవా చేశారు. పట్టుకుని రమ్మని ఆదేశాలిస్తే తప్ప కేసీఆర్ సభకు వచ్చేటట్టు లేరని అన్నారు. రెవెన్యూ సమాచారం కేంద్ర సంస్థ ఎన్ఐసీకి ఇవ్వకుండా ప్రైవేటుకు ఎందుకు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. రూ. 110 కోట్ల విలువైన కాంట్రాక్టు రూ.1400 కోట్ల వాల్యూకు ఎలా వచ్చిందన్న సీఎం, దీనిపై విచారణ చేయాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. 1982లో వచ్చిన భూకబ్జా నిరోధక చట్టాన్ని తెలంగాణ ఏర్పాటు కాగానే కేసీఆర్ రద్దు చేశారని గుర్తుచేశారు. ఆ చట్టాన్ని ఎందుకు రద్దు చేశారో కేసీఆర్ చెప్పాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి వస్తుందనే సభ నుంచి పారిపోయారని విమర్శించారు. 2021 నాటికి 21 లక్షల 93వేల 50 ఎకరాలను పార్టు బి కింద నిషేధిత జాబితాలో పెట్టారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2023 నాటికి ధరణితో తెలంగాణ సమాజానికి కేసీఆర్ గుండు కొట్టారని విమర్శించారు. ధరణిని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నేతలు విచ్చలవిడిగా సంపాదించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు, దళారీలు వేర్వేరు కాదని ఇద్దరూ ఒకటేనని రేవంత్ రెడ్డి అన్నారు. కండువా వేస్తే బీఆర్ఎస్ నేత, కండువా తీస్తే దళారీ అని అభివర్ణించారు. అధికారంలోకి వచ్చాక భూముల సమస్య పరిష్కారం కోసం తలలు బద్దలు కొట్టుకున్నామన్నారు.తెలంగాణకు చెందిన 2.5కోట్ల ఎకరాల భూమి డేటా మాఫియా చేతికి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు చెందిన భూముల సంపూర్ణ సమాచారాన్ని మాఫియా చేతికి ఇచ్చారని ధ్వజమెత్తారు. కేసీఆర్ సభలో ఉన్నప్పుడే 22ఏ బండారం బయటపెట్టాలని భావించానని తెలిపారు. ఆ విషయం తెలిసి కావాలనే బీఆర్ఎస్ సభ్యులు సస్పెండ్ అయ్యేలా వ్యవహరించారన్నారు. బండారం బయటపడుతుందనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి పారిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ధరణి 2010లో ఒడిశాలో మొదలైందని రేవంత్ రెడ్డి అన్నారు. 2014లో కాగ్ ధరణిపై తీవ్రంగా ఆక్షేపించిందన్నారు. 2018లో ధరణి కాంట్రాక్టును ఐఎల్ ఎఫ్ఎస్ దక్కించుకుందని వివరించారు. ఐఎల్ఎఫ్ఎస్, ధరణిని టెరాసిస్ అనే కంపెనీకి అమ్ముకుందని విమర్శించారు. టెరాసిస్ కంపెనీలో శ్రీధరరాజుకు వాటా ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు.

మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. బుధవారం శాసనసభలో మాట్లాడిన ఆయన, ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కేసీఆర్‌కు 700 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందో లేదో నిగ్గుతేల్చాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈ విషయాన్ని కేసీఆర్ ఎందుకు వెల్లడించలేదని ఆయన ప్రశ్నించారు. విచారణలో ఆ భూమి ప్రభుత్వానిదని తేలితే, దాన్ని నిరుపేదలకు పంచిపెడతామని సభలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కుటుంబానికి ఉన్న భూముల వివరాలను కూడా రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబానికి సిద్దిపేటలో 67.5 ఎకరాలు, కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కవిత కుటుంబానికి 37 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది జిల్లాల పరిధిలోని 24 మండలాల్లో కల్వకుంట్ల కుటుంబానికి మొత్తం 439 ఎకరాల భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. జోగినపల్లి సంతోష్ కుమార్ కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్ రావుకు 52 ఎకరాలు, కొండల్ రావుకు 48 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్‌పై తాను బాంబులు ఎందుకు వేస్తానని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. నేనేమైనా బిన్ లాడెన్‌నా అని ఆయన ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. అదే సమయంలో, ఎల్బీనగర్ పరిధిలోని జీవో 118 కింద ఉన్న భూముల క్రమబద్ధీకరణపై కూడా సీఎం కీలక ప్రకటన చేశారు. ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్న సుమారు 9,500 మందికి త్వరలోనే శుభవార్త అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## సెమీకండక్టర్ రంగానికి రెడ్ కార్పెట్..

మొదటిపేజీ తరువాయి..

బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ



ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ‘తెలంగాణ గ్లోబల్ సమ్మిట్’కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా..?




మొదటిపేజీ తరువాయి..

ఈ రోజు వరకు భూభారతి వరకు నీ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో.. మా హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా..? హైకోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దామా... నువ్వు ముందుకు రా..నీ కింద పనిచేసే అధికారులు కాదు.. నీది లేదు.. నాది లేదు.. సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దాం. బీఆర్ఎస్ హయాంలో జరిగింది కానీ.. ఈ మూడేళ్ల రేవంత్ రెడ్డి పాలనలో జరిగిన అవకతవకల మీద, ధరణిలో, భూభారతిలో రేవంత్ రెడ్డి హయాంలో జరిగిన వాటి మీద మీ ఆస్తుల గురించి మా ఆస్తుల గురించి కూడా మాట్లాడుదామన్నారు. మా ఆస్తులు, రేవంత్ రెడ్డి ఆస్తులు నీ తమ్ముళ్ల ఆస్తులు ఎట్ల పెరిగినయ్..అన్నింటి మీద సిట్టింగ్ జడ్జితో మేం ఎంక్వైరీకి సిద్ధం.. నువ్వు రెడీనా..? అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి కుటుంబానికి 308 ఎకరాల భూమి ఉందని గంటన్నరలో మాకు సమాచారం వచ్చింది. రేవంత్ రెడ్డి భూమి పక్కనే ఓఆర్ఆర్ అలైన్‌మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు కూడా వచ్చాయని తెలిసింది. ఫ్యూచర్ సిటీ చుట్టూ, మిగతా చోట్ల ఉన్న భూముల వివరాలు అన్నీ సేకరిస్తున్నామని హరీశ్ రావు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద బీఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పే ధైర్యం లేక రేవంత్ రెడ్డి డైవర్షన్ డ్రామాకు దిగుతున్నారని ఇవాళ అసెంబ్లీ మీటింగ్ చూసిన ప్రతీ ఒక్కరికీ స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. మొత్తం రేవంత్ రెడ్డి అబద్దాలు, అర్థ సత్యాలు చెప్పి ఒక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని ఆరోపించారు. ఆయన మాట్లాడినవన్నీ కూడా పచ్చి అబద్దాలు.. మా రాహుల్ గాంధీ టీ షర్ట్, స్టిక్కర్లు వేసుకొని లోక్ సభకు పోయారు. లోక్ సభ నియమ నిబంధనలువేరు.. అసెంబ్లీ నియమ నిబంధనలు వేరు. అంటే మీ రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు టీ షర్ట్ వేసుకొని పోతే ఒప్పు.. అదే బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ షర్ట్ వేసుకొని అసెంబ్లీకి వస్తే తప్పు అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. కొన్ని రూల్స్ ఉంటాయి.. రాజ్యాంగం ఉంటది.. కొన్ని సంప్రదాయాలు ఉంటాయంటడు. అసలు అసెంబ్లీలు ఏ సంప్రదాయాలు పాటిస్తాయి.. లోక్ సభలో పాటించే సంప్రదాయాలే సాధారణంగా అసెంబ్లీలు కూడా పాటిస్తుంటాయి. లోక్‌సభలో రాహుల్ గాంధీ టీ షర్టులు, స్టిక్కర్లు వేసుకోవచ్చని రాహుల్ గాంధీ రేవంత్‌రెడ్డిని సమర్థిస్తడు. బీఆర్ఎస్ వేస్తే తప్పు.. బీఆర్ఎస్ ఏమైనా టీ షర్ట్ మీద బూతు పదం రాసుకొని వచ్చిందా..? ఏమైనా నిషేధించిన పదాలు రాసుకొచ్చిందా అని ప్రశ్నించారు. నీ ఆరు గ్యారంటీల అమలులో నువ్వు విఫలం అని రాసింది నిజం కాదా..? అవ్వాతాతలు రూ.4 వేలు ఎగ్గొట్టింది నిజం.. మహిళలకు రూ.2500 ఎగ్గొట్టింది నిజం. విద్యార్థులకు భరోసా కార్డు ఇవ్వంది నిజం అని రాసుకొస్తే అదేదో బూతు పదం,నిషేధితపదమని మమ్మల్ని సస్పెండ్ చేసినవ్. వీళ్లు కావాలనే అసెంబ్లీ నుంచి పోయిర్రు అని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడుతడు.. మేం పోలేదు అసెంబ్లీ నుంచి.. పథకం ప్రకారం నువ్వు పంపించినవ్.. మా సోదరీమణులు, శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి గొంగు పిసికారు.. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారు.. దాని మీద ఎంక్వైరీ చేయండి.. క్షమాపణ చెప్పండి.. లేదా మాట్లాడటానికి మైక్ ఇవ్వండి సబితక్కకు అని 10 సార్లు స్పీకర్‌ను అడిగాం. నిండు శాసనసభ సాక్షిగా గేటు ముందే మహిళా ఎమ్మెల్యేల మీద హత్యాయత్నం జరుగుతుంటే మైకు కూడా ఇవ్వలేదన్నారు. మేం సభలో ఉంటే మీ బండారాన్ని బయటపెడతామని.. మీ కుంభకోణాలన్నీ బయటకు వస్తాయని, నీ తమ్ముడి కుంభకోణాలు బయటపెడతామని, నీ కుటుంబ కుంభకోణాలన్నీ బయటకొస్తాయని సభ నుంచి సస్పెండ్ చేసింది నువ్వు కదా..? అని ప్రశ్నించారు. సస్పెండ్ చేస్తే ఒక్క రోజు చేయొచ్చు కదా.. మొత్తం సెషన్‌కు ఎందుకు చేసినవ్ అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రంగనాయక సాగర్ దగ్గర హరీశ్ రావుకు ఫాం హౌస్ ఉందంటడు. ఓ బ్రహ్మాండమైన ఫాం హౌస్ కట్టుకున్నడని అన్నడు. కనీసం అక్కడ ఉచ్చ పోసేందుకు రూం కూడా లేదని అన్నారు. సీఎం రేవంత్ తనపై తన కుటుంబంపై చేసిన ఆరోపణలకు ఆధారాలతో సహా హరీశ్ రావు సమాధానం ఇచ్చారు. అది వ్యవసాయ భూమి. ఇది నా 2018 ఎలక్షన్ అఫిడవిట్, 2023 అఫిడవిట్. వీటిలో స్పష్టంగా నా వ్యవసాయ భూమి వివరాలు పబ్లిక్ డొమైన్‌లో ఉన్నయి. ఈ రోజు ఒక గుంట భూమి కూడా ఎక్కువ లేదు.. తక్కువ లేదు. ప్రజలకు స్పష్టంగా పబ్లిక్ డొమైన్‌లో పెట్టింది. 2018, 2023 నా ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ ప్రతీ సంవత్సరం నేను ఏం కొన్నా అనేది ఇన్‌కం టాక్స్ రిటర్న్‌లో కూడా స్పష్టంగా ఫైల్ చేశానన్నారు. ఈ భూమి మీద రెండేళ్ల నుంచి విజిలెన్స్, ఇంటెలిజెన్స్‌ను పెట్టి మా జిల్లా కలెక్టర్‌ను ఇప్పటికీ హైదరాబాద్‌కు 50 సార్లు పిలిచి ఉంటరు. కలెక్టర్లను, ఆర్డీవోలను, సర్వేయర్లను 50 సార్లు పిలిచి ఉంటరు హైదరాబాద్‌కు. విజిలెన్స్ ఎంక్వైరీలు, సీఐడీ ఎంక్వైరీలు పోలీసులు తిరుగుతనే ఉంటరు. నేను మా జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవోకు, ఎమ్మార్వోకు ఒక చాలన్ కట్టి నా భూమి కొలిచి హద్దు బంద్‌లు పెట్టండని ఏడీ సర్వేకు చలాన్ కట్టిన. గవర్నమెంట్ కొలిచి నేను కొనుక్కున్న దాని కంటే నాకు ఒక గుంట తక్కువంది అని ఏడీ సర్వే ల్యాండ్ రికార్డ్స్ సర్వే చేసి సంతకం పెట్టి నాకు ఇచ్చిన డాక్యుమెంట్ ఇదన్నారు.

ఇక ఆ రోడ్డు వేసింది నా కోసం కాదు. నాకంత అవసరం కూడా లేదు. అక్కడ చంద్లాపూర్ గ్రామానికి సిరిసిల్ల రోడ్డుకొచ్చే నక్ష రోడ్డు ఆ రోజు ఆ రిజర్వాయర్‌లో మునిగిపోయింది. మునిగిపోతే జిల్లా పరిషత్ తీర్మానం చేసి జెడ్పీ చైర్మన్, అప్పటి సర్పంచ్ లెటర్ వారందరి కోరిక మేరకు మాకు సిరిసిల్లకు రోడ్డు లేకుండా అయితుంది. మా పాత రోడ్డు అందులో మునిగిపోయిందని చెప్తే..అది ఈయన మున్సిపల్ డిపార్ట్‌మెంట్ వేసిందని కూడా తప్పు చెప్పిండు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ వాళ్లే.. వాళ్ల చెరువులో రిజర్వాయర్ పోయింది కనుక ఆ రోడ్డు వేసింది ఇవ్వడం జరిగింది తప్ప అందులో ఎవరి కోసమో చేసింది లేదన్నారు.

# సూడాన్ కుప్పకూలిన బంగారు గని..

మొదటిపేజీ తరువాయి..

ఈ ప్రమాదంపై స్థానిక యంత్రాంగం ది అసోసియేటెడ్ ప్రెస్ కు ఇచ్చిన వివరాల ప్రకారం.. ఇప్పటి వరకూ 82 మంది మృతదేహాలను వెలికి తీశామని తెలిపింది. అలాగే డజన్ల కొద్దీ గల్లంతయ్యారని వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఓ అధికారి మాట్లాడుతూ.. ఆదివారం నుంచే ఈ గోల్డ్ మైన్ లోని ఓ షాఫ్ట్ వద్ద పగుళ్లు వచ్చాయని.. అక్కడి నుంచి క్రమంగా విస్తరిస్తూ ఇవాళ బంగారు గని కుప్పకూలిందని అన్నారు. ఈ గని వద్ద ప్రైవేట్ యాజమాన్యానికి చెందిన ఒకే ఒక్క లిఫ్ట్ మాత్రమే ఉందని వివరించారు. దాంతో రెస్క్యూ ఆపరేషన్ కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అన్నారు. ఈ క్రమంలోనే అధిక సంఖ్యలో చిక్కుకున్నవారిని కాపాడలేకపోయామని వివరించారు. ఇక ఇదే ఘటనపై ది కొర్డోఫాన్ అబ్జర్వేటరీ మానిటరింగ్ గ్రూప్ స్పందిస్తూ.. బంగారు గని కుప్పకూలిన ఘటనలో కనీసం 70 మందికి పైగా మృతి చెందారని పేర్కొంది. మృతులంతా స్థానిక కార్మికులను స్పష్టం చేసింది. ఇక ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన సయిద్ గబారా అనే మహిళ మాట్లాడుతూ.. బొగ్గు గని చాలా దూరం కుప్పకూలిందని.. ఈ శిథిలాలను తొలగించేందుకు అవసరమైన మెషినరీ ప్రస్తుతం అందుబాటులో లేదని తెలిపింది. ఇక ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం ఉత్పత్తి చేసే దేశాల్లో సూడాన్ ఒకటి. కానీ ఇక్కడ గనుల భద్రత ఎప్పుడూ ప్రశ్నార్థకంగానే మారుతోంది. కార్మికులకు సరైన భద్రతా ఏర్పాట్లు లేక ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు ఇప్పటికే సూడాన్ లో ఆర్థిక సంక్షోభం, అంతర్యుద్ధం కారణంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సంగతి తెలిసిందే.



## షహజాద్ భట్టి నెట్‌వర్క్‌పై ఉక్కుపాదం..


మొదటిపేజీ తరువాయి..

షహజాద్ భట్టి నెట్‌వర్క్ సంస్థతో పాటు దాని సభ్యులపై ఉగ్రవాద నిధులు (టెర్రర్ ఫైనాన్సింగ్), కుట్ర వంటి తీవ్రమైన అభియోగాల కింద కేసులు నమోదు చేసేందుకు దర్యాప్తు సంస్థలకు మార్గం సుగమమైంది. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అందులో భాగంగానే ఈ కఠిన చర్యలు తీసుకున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ సంస్థ సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేస్తూ, యువతను, చిన్నచిన్న నేరస్థులను ఉగ్రవాదం వైపు ప్రేరేపిస్తోందని ఆయన పేర్కొన్నారు. విద్వేషపూరిత డిజిటల్ కంటెంట్‌తో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, మత సామరస్యానికి ఈ సంస్థ విఘాతం కలిగిస్తోందని హోంశాఖ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ మద్దతుతో నడుస్తున్న సిండికేట్‌గా అధికారులు ఎస్‌బీఎన్‌ను అభివర్ణిస్తున్నారు. గ్రెనేడ్లు, ఐఈడీ దాడులు, లక్షిత హత్యలు, పోలీసు, రక్షణ, మతపరమైన ప్రదేశాలపై నిఘా వంటి అసాంఘిక కార్యకలాపాల్లో ఈ సంస్థకు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని అధినేత షహజాద్ భట్టి దుబాయ్, పాకిస్థాన్‌ల నుంచి తన కార్యకలాపాలను నిర్వహిస్తుంటాడు. 2025 మార్చిలో పంజాబ్‌లోని జలంధర్‌లో యూట్యూబర్ రోజర్ సంధు నివాసంపై జరిగిన గ్రెనేడ్ దాడి, 2024 నవంబర్‌లో నటుడు మిథున్ చక్రవర్తికి అందిన బెదిరింపుల వెనుక భట్టి హస్తం ఉన్నట్లు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి కొన్ని వారాల ముందు భద్రతా ఏజెన్సీలు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి ఎస్‌బీఎన్‌తో సంబంధం ఉన్న 253 మందిని అదుపులోకి తీసుకున్నాయి. వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు, తుపాకులు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టులు, పలు కేసుల్లో వెల్లడైన ఆధారాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎస్‌బీఎన్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

## న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి..

పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా.



సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఇరు దేశాల ఆమోద ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుంది. ఈ ఏడాది చివర్లోనే ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెక్లే చెప్పారు. 2030 నాటికి భారత్-న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. వెస్ట్‌పాక్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన నివేదికలోనూ భారత్ వృద్ధి అవకాశాలను ప్రస్తావించింది. ఎఫ్‌టీఏ వల్ల వచ్చే పదేళ్లలో న్యూజిలాండ్ జీడీపీకి దాదాపు 0.1 శాతం అదనపు వృద్ధి రావచ్చని అంచనా వేసింది.

**CHANGE OF NAME**

I, RAVULA NARESH S/O RAVULA UPENDER REDDY (old name) born on 10-02-1993 at Khammam hereby changing my Name and henceforth in future I would be known as RAVULA NARESH REDDY S/O RAVULA UPENDER REDDY (new name) HNo. 5-48/1 Echoda, Dist. Adilabad 504307 Telangana State.

Place: Echoda
Date: 17-09-2026

DECLARANT
**RAVULA NARESH REDDY**
S/O RAVULA UPENDER REDDY

# నేరడిగొండ పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎల్‌డీఓ



**నేరడిగొండ, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** జిల్లా పశుగణాభివృద్ధి శాఖ అధికారి (డీఎల్‌డీఓ)గా పదోన్నతి పొందిన అనంతరం డాక్టర్ దూద్ రామ్ రాథోడ్ బుధవారం తొలిసారిగా నేరడిగొండ మండల కేంద్రానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నేరడిగొండ ప్రాథమిక పశువైద్య కేంద్రంతో పాటు వాంకిడి ప్రాథమిక పశువైద్య కేంద్రం, వడూర్ గోపాలమిత్ర కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పశువైద్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హాజరు రికార్డులు, మందుల నిల్వలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రైతులకు అందుతున్న పశువైద్య సేవలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎల్‌డీఓ డాక్టర్ దూద్ రామ్ రాథోడ్ మాట్లాడుతూ పశు వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ గ్రామాల్లోని రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులకు మెరుగైన ఉచిత పశువైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పశుసంవర్ధక పథకాలు, టీకా కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించి, ప్రతి రైతుకూ వాటి ప్రయోజనాలు అందేలా చొరవ చూపాలని ఆదేశించారు. పశువైద్య కేంద్రాలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

ఈ తనిఖీలో నేరడిగొండ మండల పశువైద్యాధికారి డాక్టర్ జీవన్ రాథోడ్, వాంకిడి ప్రాథమిక పశువైద్య కేంద్రం పశువైద్యాధికారి డాక్టర్ గోవింద్ నాయక్‌తో పాటు పశువైద్య శాఖ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

# ఖబడ్దార్ హమారా ప్రసాద్

**- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి**
**- హమారా ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16, (ప్రజాజ్యోతి) :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, కించపరిచే విధంగా పోస్టులు చేసిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ మాట్లాడుతు అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై ప్రభుత్వం, పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని ప్రభుత్వం వెంటనే అడ్డుకోవాలని కోరారు.అనంతరం హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంటోళ్ల వెంకటస్వామి, కొంతం మురళీధర్, ఎలమల రాజేశ్వర్, ఎలమల ప్రభాకర్, ఆకుల రమేష్, దరువు భోజన్న, సందీప్, మసీదు రమేష్, కప్పకంటి సురేష్, నరేందర్, సేపురి సిద్ధార్థ, రావుల వినేందర్, పురుషోత్తం, రాజలింగం, గుండా సతీష్, మాడస్తూ భూమేష్, బత్తుల రాజు, సంపత్, దినేష్, వినోద్, గంగాధర్, తదితర జిల్లా, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న దరువు భోజన్న డప్పు వాయిద్యంతో..**

నిరసన కార్యక్రమంలో సారంగాపూర్ గ్రామానికి చెందిన ఉత్తమ కళాకారుడి అవార్డు, రివార్డు గ్రహీత, ప్రజా కళాకారుడు దరువు భోజన్న తనదైన ప్రత్యేక శైలిలో డప్పు వాయిద్యంతో ఆకట్టుకున్నారు. డప్పు దరువులతో కార్యక్రమంలో ఉత్సాహాన్ని నింపుతూ పాల్గొన్న వారిని ఉర్రూతలూగించారు. ఆయన కళా ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# శ్రీరాంపూర్‌లో ఐఎన్‌టీయూసీ బలోపేతానికి శ్రీకారం



**మంచిర్యాల, 16, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** సింగరేణి కాలరీస్‌లోని ప్రధాన ఏరియాల్లో ఒకటైన శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ -- ఐఎన్‌టీయూసీను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. త్వరలో జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని ఆరు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్‌కాస్ట్ గనులు, 15 డిపార్ట్‌మెంట్లను సమన్వయం చేస్తూ యూనియన్ నాయకత్వ బాధ్యతలను పునర్వ్యవస్థీకరించారు. శ్రీరాంపూర్ ఏరియాలో యూనియన్ కార్యకలాపాలను మరింత విస్తృతంగా కొనసాగించేందుకు జెట్టి శంకర్ రావును సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించడంతో పాటు చాట్ల అశోక్ (స్పోర్ట్స్ సూపర్‌వైజర్, జీఎం ఆఫీస్), ల్యాగల శ్రీనివాస్ (హెడ్ ఓవర్‌మెన్, ఆర్కేస్టీ), శీలం చిన్నయ్య (ఈపీ ఆపరేటర్, ఎస్ఆర్‌పీ ఓసీ)లను వైస్ ప్రెసిడెంట్లుగా నియమించారు. అండర్‌గ్రౌండ్, ఓపెన్‌కాస్ట్, సర్ఫేస్ డిపార్ట్‌మెంట్లలో ఐఎన్‌టీయూసీను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే ఈ పునర్వ్యవస్థీకరణ ప్రధాన ఉద్దేశ్యమని నాయకత్వం తెలిపింది. శ్రీరాంపూర్ ఏరియాలోని ప్రతి గని, డిపార్ట్‌మెంట్‌లో కార్మికులతో సమన్వయం పెంచి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఐఎన్‌టీయూసీను మరింత బలోపేతం చేస్తామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ నివాసంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహా రెడ్డి, ధర్మపురి, సమ్మయ్య, శంకర్ రావు, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వరం పోషణ్ అభియాన్

**పోషకాహార లోపం నివారణకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు**







**బాసర, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి) :**

పేదలకు పోషణ్ అభియాన్ వరం లాంటిదని, బాలింతలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి వినూత్న అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహార లోపం తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలింతలకు పలు సూచనలు చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం, గుడ్లు, పాలు, బాలామృతం అందిస్తున్నామని చెప్పారు. పిల్లల ఎత్తు, బరువు కొలిచి వారి ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రక్తహీనత నివారణకు ఐఎఫ్ఏ మాత్రలు అందించడంతో పాటు సరైన ఆహారంపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పోషకాహార లోపం లేని గ్రామాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించేందుకు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ముధోల్ ప్రాజెక్టు అధికారి రాజశ్రీ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రోజా, శైలజ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, పోషకులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలి






**డీఆర్వో రాథోడ్ రమేష్**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16, (ప్రజాజ్యోతి) :**

క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్ సూచించారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులకు అవగాహన, దిశానిర్దేశ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ..

జిల్లాను టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని సూచించారు. టీబీని కేవలం వైద్య సమస్యగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి, పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ఉచిత చికిత్స నిరంతరాయంగా అందేలా చూడాలని, రోగులు మందులను క్రమం తప్పకుండా వినియోగించేలా పర్యవేక్షించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, సన్నిహిత పరిచయస్తుల్లో అవసరమైన స్క్రీనింగ్ నిర్వహించడంతో పాటు రోగులకు పోషక సహాయం అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రాజేందర్ మాట్లాడుతూ.. నిక్షయ్ మిత్రల ద్వారా టీబీ రోగులకు పోషకాహారం, సామాజిక సహకారం అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలను భాగస్వాములను చేయాలని సూచించారు. టీబీపై ప్రజల్లో ఉన్న అపోహలు, వివక్షను తొలగించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. టీబీ లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని అధికారులు సూచించారు. కుటుంబ సభ్యులు, సమాజం అండగా నిలిచి టీబీ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాల చరిత్రే తెలంగాణకు బలం

**- స్వేచ్ఛా స్ఫూర్తిని తరతరాలకు అందించాలి**
**- త్యాగధనుల ఆశయాలు మాటల్లో కాదు.. ఆచరణలో కనిపించాలి**
**- తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ**





**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** త్యాగాల పునాదులపై రూపుదిద్దుకున్న తెలంగాణలో స్వేచ్ఛ, హక్కులు, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గుర్నులే నారాయణ అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన రోజని, ఈ రోజును కేవలం ఒక వేడుకగా కాకుండా గత పోరాటాలను గుర్తు చేసుకునే సందర్భంగా చూడాలని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం జరిగిన పోరాటాలు, ఉద్యమాల్లో పాల్గొన్న నాయకులు, సామాన్య ప్రజలు, త్యాగధనుల స్ఫూర్తిని నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతాన్ని గుర్తు చేసుకోవడం ద్వారా వర్తమాన బాధ్యతను అర్థం చేసుకుని, భవిష్యత్ తరాలకు మెరుగైన సమాజాన్ని అందించగలమని తెలిపారు.

ఒక తేదీ కాదు.. ఒక చారిత్రక జ్ఞాపకం

సెప్టెంబర్ 17ను చరిత్రలోని ఒక తేదీగా మాత్రమే చూడరాదని నారాయణ అన్నారు. ఆ రోజుకు దారితీసిన చారిత్రక పరిణామాలు, ప్రజల ఆకాంక్షలు, పోరాటాలు, త్యాగాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛ కోసం ప్రజలు అనుభవించిన కష్టాలను నేటి తరం తెలుసుకోవాలని సూచించారు. హక్కులు సహజంగా లభించినవి కాదని, వాటి కోసం గత తరాలు ఎన్నో త్యాగాలు చేశాయని పేర్కొన్నారు. అందుకే విమోచన దినోత్సవాన్ని నిర్వహించుకునే సమయంలో చరిత్రను గుర్తు చేసుకోవడంతో పాటు, ఆ త్యాగాల స్ఫూర్తిని మన జీవితాల్లో ఎలా కొనసాగించాలనే దానిపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.

చరిత్రను మరచిపోతే భవిష్యత్తుకు దిశ ఉండదు చరిత్ర అనేది పాత కథల సమాహారం కాదని, అది భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే అనుభవమని నారాయణ అన్నారు. గత తరాలు ఎదుర్కొన్న పరిస్థితులు, ప్రజలు హక్కుల కోసం సాగించిన పోరాటాలు, నాయకుల త్యాగాలను యువత తెలుసుకోవాలని తెలిపారు. స్వేచ్ఛ విలువను అర్థం చేసుకోవాలంటే స్వేచ్ఛ లేని రోజుల గురించి తెలుసుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలంటే ప్రజాస్వామ్యం కోసం జరిగిన పోరాటాలను అర్థం చేసుకోవాలని అన్నారు. చరిత్రపై అవగాహన ఉన్న యువత సమాజం పట్ల మరింత బాధ్యతగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు.

**కొమురం భీమ్ నేర్పిన పోరాట పాఠం :**

కొమురం భీమ్ జిల్లా పేరు వెనుక ఒక గొప్ప పోరాట చరిత్ర ఉందని నారాయణ అన్నారు. ఆదివాసీల హక్కులు, భూమి, అడవి, నీటిపై హక్కుల కోసం కొమురం భీమ్ సాగించిన పోరాటం ఈ ప్రాంత చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. కొమురం భీమ్ పోరాటం కేవలం గతానికి సంబంధించిన అంశం కాదని, నేటి తరానికి కూడా హక్కులు, ఆత్మగౌరవం, ధైర్యం, నిబద్ధత వంటి విలువలను గుర్తు చేసే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఆయన పేరును జిల్లాకు పెట్టుకోవడం గర్వకారణమని, ఆ మహనీయుడి ఆశయాలకు అనుగుణంగా ఆదివాసీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడం నిజమైన నివాళి అవుతుందని అన్నారు.

**గుట్టల నుంచి గ్రామాల వరకు పోరాట స్ఫూర్తి :** ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి కేవలం నిర్మాణ పనులతో పరిమితం కాకూడదని నారాయణ అన్నారు. ప్రతి గ్రామానికి విద్య, వైద్యం, తాగునీరు, రహదారి, రవాణా, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని తెలిపారు. అభివృద్ధి పేరుతో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానాలు కనుమరుగుకాకుండా వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ యువతకు మెరుగైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మహిళలు, రైతులు, యువతను అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేయాలని సూచించారు.

**త్యాగధనుల కుటుంబాలకు గౌరవం అవసరం :** తెలంగాణ కోసం వివిధ దశల్లో పోరాడిన ఉద్యమకారులను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని నారాయణ అన్నారు. ఉద్యమాల్లో పాల్గొన్న వారు వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేశారని పేర్కొన్నారు. ప్రాణత్యాగం చేసిన అమరజీవుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాల పట్ల గౌరవం, ఆదరణ చూపాల్సిన అవసరం ఉందన్నారు. త్యాగధనులను స్మరించుకోవడం కేవలం కార్యక్రమాలకే పరిమితం కాకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయడంలో ప్రతిఫలించాలని తెలిపారు.

**ఫొటోలకు పూలమాలలు కాదు.. ప్రజలకు సేవే నిజమైన నివాళి :** జయంతులు, వర్ధంతులు, ప్రత్యేక దినోత్సవాల సందర్భంగా త్యాగధనుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం మాత్రమే సరిపోదని నారాయణ అన్నారు. వారి ఆలోచనలు, ఆశయాలు ప్రజల జీవితాల్లో మార్పుకు కారణమయ్యేలా ఆచరణలోకి రావాలని పేర్కొన్నారు. గ్రామంలో ఒక సమస్య పరిష్కారానికి కృషి చేయ...

# ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**దక్షిణముఖి హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేసిన దంపతులు**

**బాసర, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలోని రేణుకాపూర్ శివారులో పునర్నిర్మాణం చేపడుతున్న దక్షిణముఖి హనుమాన్ ఆలయ నిర్మాణానికి నిజామాబాద్‌కు చెందిన తెలుగుల శ్రావణి--నవీన్‌కుమార్ గౌడ్ దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సుఖేష్‌కు అందజేశారు. ఇందులో రూ.40 వేల విలువైన స్లాబ్ నిర్మాణానికి, మరో రూ.60 వేలను నగదు రూపంలో అందజేసినట్లు కమిటీ అధ్యక్షుడు సుఖేష్ తెలిపారు.

# కడ్తాల్ అయ్యప్ప ఆలయంలో అద్భుత దృశ్య

**అయ్యప్పస్వామి పాదాలను తాకిన తొలి సూర్యకిరణాలు**





**సోన్,సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి) :** ఉమ్మడి జిల్లాలో తొలి అయ్యప్ప ఆలయంగా పేరుగాంచిన సోన్ మండలం కడ్తాల్ శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప ఆలయంలో బుధవారం ఉదయం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్యోదయ వేళ తొలి లేలేత కిరణాలు ఆలయంలోని అయ్యప్పస్వామి పాదాలను నేరుగా తాకడంతో భక్తులు ఆ దృశ్యాన్ని కనులారా వీక్షించి పరవశించిపోయారు. స్వామివారి పాదాలపై సూర్యకిరణాలు పడిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ అరుదైన దృశ్యాన్ని చూసేం దుకు ఆలయానికి వచ్చిన భక్తులు ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు. సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకిన సమయంలో ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో మార్మోగింది. మామూలు రోజుల్లో ఈ విధంగా సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకే దృశ్యం కనిపించదని వినాయకచవితి, దసరా, ఉగాది వంటి పర్వదినాల సమయంలో మాత్రమే ప్రత్యేకంగా సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకుతుంటాయని ఆలయ గురుస్వామి నర్సారెడ్డి తెలిపారు.

# సీసీఆర్‌బీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, ఐటీ కోర్, సైబర్ క్రైమ్ సిబ్బందికి నగదు ప్రోత్సాహకాలు

**అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని అభినందించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, 16, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** తమకు అప్పగించిన విధులను అంకితభావం, నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రతిభ కనబరిచిన సీసీఆర్‌బీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, ఐటీ కోర్, సైబర్ క్రైమ్ విభాగాల అధికారులు, సిబ్బందికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, సైబర్ నేరాల అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం వంటి అంశాల్లో విశేష కృషి చేసిన అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, పోలీసు శాఖలోని వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేయడం ద్వారా నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు, నేరాల దర్యాప్తులో వేగం, నాణ్యత పెరుగుతాయని తెలిపారు. సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్ ఆధ్వర్యంలో, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా విభాగాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ తమ విధుల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, బాధితులకు సత్వర సహాయం అందించడం, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించడం, నేరస్తులను గుర్తించడం వంటి అంశాల్లో అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని సీపీ ప్రశంసించారు. అదేవిధంగా నేర నియంత్రణ, అక్రమ కార్యకలాపాలపై నిఘా, నేరస్తుల కదలికలను గుర్తించడం, కేసుల దర్యాప్తునకు అవసరమైన సమాచారాన్ని సేకరించడం వంటి అంశాల్లో టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధత, క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో నిర్వహించాలని సీపీ సూచించారు. విధుల్లో ప్రతిభ కనబరిచే సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతర సిబ్బందిలో కూడా మరింత ఉత్సాహం, బాధ్యతాభావం పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో విధులు నిర్వహిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు మరింత కృషి చేయాలని సీపీ సూచించారు.

# ఈ నెల 18న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా-2026

**- ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు 970 అప్రెంటిస్‌షిప్ అవకాశాలు**
**- మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్లు**



**మంచిర్యాల, 16, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) :** ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు, అప్రెంటిస్‌షిప్ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా--2026ను ఈ నెల 18న నిర్వహించనున్నట్లు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి. వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని పలు ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధుల సమక్షంలో ఈ మేళా నిర్వహించనున్నట్లు బుధవారం తెలిపారు .ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో మొత్తం 970 ఖాళీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎంపికయ్యే అభ్యర్థులకు ఆయా సంస్థలను బట్టి నెలకు రూ.8,200 నుంచి రూ.19,000 వరకు స్టైపెండ్ అందించనున్నట్లు తెలిపారు . ఈ మేళాలో ఎంటీఏఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 150, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, ష్నైడర్ ఎలక్ట్రికల్ లిమిటెడ్‌లో 100, ప్రీమియర్ ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, రేన్ మద్రాస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, ఎల్ అండ్ టీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 200, శక్తి హార్మన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 100, జెన్ టెక్నాలజీస్‌లో 80, ఆదర్శ్ ఆటోమొబైల్స్ లిమిటెడ్ మంచిర్యాలలో 30, ఎం/ఎస్ శ్రీనివాస్ రావు సివిల్ కాంట్రాక్టర్ ప్రైవేట్ లిమిటెడ్ రెబ్బనలో 10 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఫిట్టర్, వెల్డర్, టర్నర్, సిఎన్‌సి మెషిన్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, మెకానిక్ డీజిల్ తదితర ట్రేడుల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు రెజ్యూమ్/బయోడేటా, అప్రెంటిస్‌షిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్‌ఎస్‌సీ మెమో, ఐటీఐ మెమో, ఎన్‌టీసీ సర్టిఫికెట్, కాస్ట్ సర్టిఫికెట్, బ్యాంక్ పాస్‌బుక్ కాపీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు. అర్హతలు, ఇతర వివరాల కోసం మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.



# అంతర్జాతీయ బాల్యవివాహాల నిర్మూలన దినోత్సవం ప్రకటించడం గర్వకారణం:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

★ బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

గద్వాల సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి ప్రతినిధి):
బాల్యవివాహాల నిర్మూలనకు రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్డీఎస్) చేస్తున్న కృషి ప్రశంసనీయమని,సంస్థకు సంబంధిత అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.బాల్యవివాహాలు,బలవంతపు వివాహాల నిర్మూలన కోసం నవంబర్ 27వ, తేదీని అంతర్జాతీయ దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ నిర్ణయించిన నేపథ్యంలో,రూరల్ డెవలప్మెంట్ సొసైటీ



ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికలను బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,2025 నవంబర్ 27న భారతదేశంలో సుమారు 250 మిలియన్ల మంది పౌరులు బాల్యవివాహాల నిర్మూలనకు ఆర్డీఎస్ వ్యవస్థాపకుడు భువన్ రిభు సంకల్పంతో ప్రతిజ్ఞ చేశారని తెలిపారు.ఈ నేపథ్యంలో నవంబర్ 27వ,తేదీని బాల్యవివాహాల నిర్మూలన దినంగా ప్రతిపాదించగా ఐక్యరాజ్యసమితి ఆమోదించడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.స్త్రీ,శిశు సంక్షేమ శాఖతో పాటు జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు జిల్లాలో జరుగుతున్న బాల్యవివాహాలపై నిరంతరం నిఘా ఉంచి,వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహం జరగబోతున్నట్లు సమాచారం తెలిసినట్లయితే స్వచ్ఛంద సంస్థలు, యువత,ఇతర పౌరులు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సునంద, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్,జిల్లా కోఆర్డినేటర్ ఎడ్విన్,చంద్రశేఖర్, ధనలక్షి ,విద్యుల్లత,సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా పార్టీ కార్యాలయంలో బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం వేడుకలు

ఆలంపూర్ సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి):
తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉదయం 09:15 గంటలకు నియోజకవర్గ ★బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు హాజరుకానున్నారు. కావున,మాజీ మున్సిపల్ చైర్మన్ లు ,సర్పంచులు,కౌన్సిలర్లుమాజీ జడ్పీటీసీలు,మాజీ ఎంపీపీలు,మాజీ సర్పంచులు,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని,విజయవంతం చేయవలసిందిగా వారు తెలిపారు.

## వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు

– నిమజ్జన ప్రదేశాల్లో భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి
– ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
వినాయక విగ్రహాల నిమజ్జనం సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



అధికారులను ఆదేశించారు. బుధవారం దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం గుర్తించిన చెరువులను ఆయన పరిశీలించారు. నిమజ్జనానికి సంబంధించి ఇప్పటికే చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో అవసరమైన భద్రతా చర్యలు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.
ఈ పరిశీలన కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, మున్సిపల్ చైర్మన్‌తో పాటు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సి.హెచ్. చంద్రశేఖర్ బుధవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలోని ఆమె గదిలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ



సందర్భంగా నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌కు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందనలు తెలిపారు. జడ్చర్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ అక్రమ మద్యం తయారీ, విక్రయాలు, రవాణాతో పాటు మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు.
ఎక్సైజ్ శాఖకు సంబంధించిన నిబంధనలను పటిష్టంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, ప్రభుత్వ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమన్వయంతో పనిచేస్తూ, ఎక్సైజ్ శాఖ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.

# వరి ధాన్యం సేకరణ పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

★ రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యంపై క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలి ★ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలి

గద్వాల సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు నిబంధనల మేరకు చేపట్టాలని వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక ఇన్‌చార్జిని నియమించాలని,బయటి వ్యక్తులను అనుమతించకూడదని సూచించారు.కొనుగోలు కేంద్రాల్లో ఫ్లెక్సీలు ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలించే సమయంలో దూరాన్ని పరిగణనలోకి తీసుకుని,సాధ్యమైనంత తక్కువ దూరంలో ఉన్న మిల్లులకు పంపేలా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి స్మార్ట్ రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.





జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అక్టోబర్ 1వ,తేదీ నుంచే జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి సౌకర్యాలతో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులు,టార్పాలిన్లు,తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు,తేమ నిర్ధారణ యంత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల నుంచి హమాలీ,గన్నీ బ్యాగులు తదితర పేర్లతో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు.వ్యవసాయ అధికారులు ధాన్యంలో తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించి నమోదు చేయాలని,ప్రతి కొనుగోలు కేంద్రంలో మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వహిస్తూ రోజువారీ ఏర్పాటు చేసి టోల్‌ఫ్రీ నంబర్,కనీస మద్దతు ధర,బోనస్ తదితర వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు.ధాన్యం నిల్వల కోసం అవసరమైన బఫర్ గోదాములను ముందుగానే గుర్తించాలని ఆదేశించారు.రాష్ట్ర సరిహద్దుల వద్ద ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని పోలీసు,రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోకి రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ఓపీఎంఎస్‌లో వివరాలను రోజువారీగా అప్‌డేట్ చేయాలని,రైతులకు చెల్లింపులు సమయానికి,పారదర్శకంగా జరిగేలా చూడాలని అన్నారు.బిల్లులు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.కొనుగోలు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి ముందస్తుగా శిక్షణ ఇవ్వాలని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎంపిక చేసిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని చర్యలు చేపట్టాలని సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వం పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. విజిలెన్స్ అధికారులు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించడంతో పాటు కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారని పేర్కొన్నారు.విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
రైస్ మిల్లుల్లో గతంలో కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలపై తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.తనిఖీల వివరాలను డీజీఎస్‌సీ/పీవీ యాప్‌లో నమోదు చేసి నివేదికలను సక్రమంగా సమర్పించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకుండా నివేదికలు నమోదు చేసినా,తప్పుడు నివేదికలు సమర్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
అలాగే లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా మండలాల్లో వేగవంతంగా

### అక్రమ ధాన్యం రవాణాను అరికడతాం:ఎస్పీ

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ,ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పోలీసు శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధు మోహన్,జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్,పౌర సరఫరాల మేనేజర్ విమల,జిల్లా వ్యవసాయాధికారి వీరప్ప,కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్,మార్కెటింగ్ అధికారిణి పుష్పమ్మ,ఎల్‌డీఎం శ్రీనివాసరావు,తహసీల్దార్లు,మండల వ్యవసాయ అధికారులు,డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అపశృతులకు తావులేకుండా వినాయక నిమజ్జన ఏర్పాట్లు

★ నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ

గద్వాల సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి ప్రతినిధి):
జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అపశృతులు చోటుచేసుకోకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఎస్పీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.బుధవారం ఎర్రవల్లి మండలంలోని ఏర్పాటు చేసి,చిన్న విగ్రహాలతో వచ్చే భక్తులు ఒక మార్గంలో,పెద్ద విగ్రహాలను తరలించే వాహనాలు మరో మార్గంలో వెళ్లేలా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.నిమజ్జన ప్రాంతంలోకి అనవసర వాహనాలు ప్రవేశించకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని,ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత





బీచుపల్లి కృష్ణా నది పుష్కర ఘాట్ల వద్ద వినాయక నిమజ్జనం నిర్వహించనున్న ప్రాంతాన్ని కలెక్టర్,ఎస్పీ సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పెద్ద విగ్రహాలు,వాహనాలు సులభంగా నిమజ్జన ప్రాంతానికి చేరుకునేలా రహదారులను చదును చేసి,అవసరమైన చోట్ల మట్టి,మొరం,రాళ్లతో మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రహదారిలో వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను గుర్తించి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.పెద్ద విగ్రహాలను తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని,రాత్రి వేళల్లో భక్తులు,నిర్వాహకులు,వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు.భక్తులు,భారీ వాహనాల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు.నిమజ్జన ఏర్పాట్ల కోసం జేసీబీలు,క్రేన్లు,రోలర్లు, ఇతర అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.వాహనాల వినియోగానికి సంబంధించి విధుల వివరాలు,సిబ్బంది సంతకాలు,రోజువారీ రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు.నిమజ్జన ప్రాంతాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు,వైద్య సిబ్బంది,అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలని, మత్స్యకారులు,గజఈతగాళ్ల సేవలను వినియోగించుకోవాలని అన్నారు.సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా,విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్,ఎస్పీ సూచించారు.ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాసరావు,డీఎస్పీ మొగిలయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# 10వ బెటాలియన్ యువ ఆపదమిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి)
సెప్టెంబర్ 16:10వ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ బీచుపల్లి నందు స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి 10వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ బి. ఆదినారాయణ





మరియు మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి ఏ.నిర్మల ముఖ్య అతిథులుగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అత్యవసర పరిస్థితులు,ప్రకృతి వైపరీత్యాలు లేదా ఇతర విపత్తులు సంభవించినప్పుడు సంబంధిత అత్యవసర సేవల



సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపు, సమీపంలో ఉన్న యువత తమకు అందుబాటులో ఉన్న వనరులతో బాధితులకు ప్రాథమిక సహాయం అందించడం, ప్రాణాలను రక్షించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు చేపట్టేలా యువతను సిద్ధం చేయడం యువ ఆపదమిత్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల పాటు విద్యార్థులకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,బాధితులను సురక్షితంగా రక్షించే విధానాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసే విధానాలపై శిక్షణఅందించనున్నారు.ఈ శిక్షణలో ముఖ్యంగా: విపత్తుల సమయంలో అత్యవసర ప్రతిస్పందన మరియు రక్షణ చర్యలు ప్రథమ చికిత్స మరియు గాయపడిన వారికి తక్షణ సహాయం సి పి ఆర్ మరియు ప్రాథమిక ప్రాణరక్షణ పద్ధతులు వరదలు,భారీ వర్షాలు తదితర నీటి విపత్తుల సమయంలో రక్షణ చర్యలు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు రక్షణ విధానాలు భూకంపాలు,భవనాల కూలిపోయే పరిస్థితుల్లో సురక్షితంగా స్పందించే విధానాలు ప్రమాద స్థలంలో బాధితులను గుర్తించడం,సురక్షితంగా తరలించడం మరియు అత్యవసర సహాయం అందించడం విపత్తుల సమయంలో స్వీయ రక్షణ, కమ్యూనికేషన్ మరియు సమన్వయం అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అవగాహన కల్పించడం,తరలింపు విధానాలు సహాయక చర్యల్లో ఉపయోగించే ప్రాథమిక రెస్క్యూ పరికరాల వినియోగం వంటి అంశాలపై సైద్ధాంతిక మరియు ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.ఈ శిక్షణలో ఎన్ఎస్ఎస్ నుంచి 43 మంది,బి ఎస్ జి 17 మంది,ఎన్ వై కే ఎస్ నుంచి 31 మంది, మొత్తం 91 మంది బాలబాలికలు పాల్గొంటున్నారు.వీరు మహబూబ్‌నగర్, వనపర్తి,నారాయణపేట,జోగులాంబ గద్వాల మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందినవారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విపత్తులు సంభవించిన సమయంలో ప్రభుత్వ అత్యవసర సేవల బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునే వరకు స్థానికంగా శిక్షణ పొందిన యువత అందించే తక్షణ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,యువ ఆపదమిత్రలుగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమాజంలో ప్రాణరక్షణ చర్యలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పార్థసారథి రెడ్డి, వెంకటరమణ,ఆర్ఐ శ్రీనివాస్,లక్ష్మణ్ బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జేపీఎన్‌సీఈలో ఘనంగా వినాయక పూజలు

– భక్తిశ్రద్ధలతో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది
– నేడు వైభవంగా వినాయక నిమజ్జనం.. ప్రత్యేక ఆకర్షణగా జబర్దస్త్ బృందం

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
మహబూబ్‌నగర్‌లోని జయప్రకాశ్ నారాయణ ఇంజినీరింగ్ కళాశాల (జేపీఎన్‌సీఈ)లో బుధవారం వినాయక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయకుడికి కళాశాల అధ్యక్షుడు కె.ఎస్. రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద




సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. కళాశాల ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు కె.ఎస్. రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు ఐక్యతా భావం, సాంస్కృతిక విలువలు, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయడం అవసరమని పేర్కొన్నారు.

### నేడు వైభవంగా వినాయక నిమజ్జనం:

వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు కళాశాల యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈ వేడుకల్లో ప్రముఖ జబర్దస్త్ బృందానికి చెందిన గడ్డం నవీన్, అభిరామ్, వినోద్, దేవరాజ్ పాల్గొని విద్యార్థులను అలరించనున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనేలా నిమజ్జన వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కళాశాల అధ్యక్షుడు కె.ఎస్. రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ పి. కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ ప్రధానాచార్యులు డాక్టర్ వి.ఈ. చంద్రశేఖర్, పరీక్షల నియంత్రణాధికారి కె. సందీప్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతం చేయాలి

'కల్పిత నాయకుడు' అంటూ అంబేద్కర్‌ను అవమానించడం సరికాదు

మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి బ్యూరో ): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలతో 'కల్పిత నాయకుడు' అనే భావనతో పుస్తకాన్ని రచించి ప్రచురించేందుకు ప్రయత్నిస్తున్న హమారా ప్రసాద్ చర్యలను నిరసిస్తూ దళిత, బహుజన



సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ కళాభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు వక్తలు హమారా ప్రసాద్ చర్యలను తీవ్రంగా ఖండించారు. సమాజంలోని అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధ హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని గుర్తుచేశారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ లోకనాయకుడైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలు, రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని అవమానించే ప్రయత్నాల కంటే ఆయన చూపిన సామాజిక న్యాయం, సమానత్వం, విద్య, హక్కుల సాధన మార్గాన్ని యువతకు పరిచయం చేయడం ముఖ్యమన్నారు. అంబేద్కర్ ఆశయాలను సమాజంలో మరింత బలంగా ప్రచారం చేయడంతో పాటు, ఆయన రచనలు, రాజ్యాంగ విలువలపై విస్తృత చర్చలు నిర్వహించాలని సమావేశంలో పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం, సమానత్వం, మానవ గౌరవం కోసం అంబేద్కర్ చేసిన కృషిని ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాలని వక్తలు సూచించారు.

ప్రజాజ్యోతి



## పర్వతగిరిలో మండల సర్వసభ్య సమావేశం

**అభివృద్ధి, ప్రజా సమస్యలపై సమీక్షించిన అధికారులు**



**పర్వతగిరి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి ఎం. నీరజ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీవో మాలోతు శంకర్, తహసీల్దార్ టి. వెంకటస్వామి, సబ్ ఇన్స్పెక్టర్ బి. ప్రవీణ్, మండల పంచాయతీ అధికారి టి. శేష ఆంజన్ స్వామి పాల్గొన్నారు.

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గౌరవ సర్పంచులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరయ్యారు. గ్రామాల వారీగా ప్రజలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సేవల అమలు తదితర అంశాలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అంశాలపై వివరాలు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. గ్రామస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి శాఖల వారీగా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశం ద్వారా గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పరం చర్చించి, అవసరమైన చర్యలపై దృష్టి సారించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాయపర్తిలో గ్రామ బాల సంక్షేమ రక్షణ కమిటీ (సి డబ్ల్యూ పి సి)ఏర్పాటు



**రాయపర్తి సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం రాయపర్తి గ్రామపంచాయతీలో బుధవారం జస్ట్ ఫర్ రైట్స్, షేర్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీకార్యాలయంలో గ్రామ సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి అధ్యక్షతన బాల సంక్షేమ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సహేంద్ర బిక్షపతి మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి బాల బాలికల రక్షణ, సంక్షేమ బాధ్యత మన అందరి బాధ్యతగా గుర్తించాలని ఆమె హితవు పలికారు. బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని కోరారు. అనంతరం షేర్ స్వచ్ఛంద సంస్థ

ప్రతినిధి జన్మ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలో 18 సంవత్సరాల నిండకుండా అమ్మాయిలకు 21 సంవత్సరాలు నిండకుండా అబ్బాయిలకు వివాహాలు చేయకూడదని అన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. అలాగే బాలలను పనులలో పెట్టి బాల కార్మికులుగా మార్చవద్దని కోరారు. పిల్లలతో వెట్టి చాకిరీ పనులు చేయించవద్దని బాల కార్మిక చట్టం ప్రకారం నిషేధం అని అన్నారు. బాల్య వివాహాలు బాల కార్మికులు లేని వ్యవస్థను నిర్మించుకోవాలని ఆయన కోరారూ. గ్రామంలో ఎవరైనా బాల్యవివాహాలకు చేసిన, ప్రోత్సహించిన,బాలలతో పనులు చేయించిన,బాల కార్మికుల గా మార్చడానికి ప్రయత్నించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ (1098) ఒకటి సున్నా తొమ్మిది ఎనిమిది కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సహేంద్ర బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ నాయక్, కరోబార్ రామచంద్రయ్య,సంస్థ ప్రతినిధి ప్రభాకర్ గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్ వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## లాయర్ రాగల్ల శ్రీహరిని సన్మానించిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు



**లింగాల గణపురం, సెప్టెంబర్, 16 (ప్రజా జ్యోతి) :** ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగమైన మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా నూతన అధ్యక్షులుగా నియమించబడ్డ సీనియర్ న్యాయవాది రాగల్ల శ్రీహరి నీ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, విహెచ్పీఎస్ నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగామ జిల్లా కోర్టులో లాయర్ గా రాగల్ల శ్రీహరి సేవలందిస్తున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగల అభ్యున్నతి, అన్ని వర్గాల సంక్షేమం, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం లాయర్స్ గా ఉద్యమ పరంగా ప్రజలకి లీగల్ సేవలు అందించడం అభినందనీయమని శ్రీహరి మాదిగ న్యాయ ఉద్యమకారుడుగా కూడా గతంలో క్రియాశీలకంగా పనిచేశాడు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్ తీసుకుంటున్న ఉద్యమ కార్యాచరణ అమలు కోసం లింగాలఘనపూర్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కూడా సేవలు అందించాడు. జాతి కోసం కీలకంగా తమ సేవలు అందించాడని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎం ఎస్ పి మాజీ జిల్లా అధ్యక్షులు గద్దల కిషోర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు పైసా రాజశేఖర్ మాదిగ, వి హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిర్రు నగేష్, విహెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు గద్దం సోమరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల మహేష్ మాదిగ, మండల అధ్యక్షులు దండు ఉమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్ ప్రక్రియపై సమీక్ష...

**– అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలి..**
**– సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి..**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 ప్రజాజ్యోతి :** గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ప్రాజెక్టు టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, టెండర్ ప్రక్రియ, పనులు చేపట్టే విధానంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, కమిషనర్ టి. వెంకన్నతో పాటు ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీఎంఏ మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థకు రూపొందించిన డీపీఆర్‌కు సంబంధించిన అంశాలను సమగ్రంగా క్రోడీకరించి, అవసరమైన ప్రక్రియలను పూర్తి చేయాలన్నారు. 15 రోజుల్లోగా టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు వేగంగా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ టెండర్ల ఆహ్వానానికి అవసరమైన చర్యలు చేపట్టి ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సీడీఎంఏకు వివరించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ ఎస్‌ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్, సీపీఓ రవీంద్ర రాడేకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

**బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నూనె అనిల్**



**రాయపర్తి సెప్టెంబర్ 16 ప్రజా జ్యోతి :** నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ సంస్థానం సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేక చొరవ ద్వారా భారత దేశంలో విలీనం అయిన సెప్టెంబర్ 17 న తెలంగాణా విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించాలని బీజేపీ రాయపర్తి మండల శాఖ అధ్యక్షుడు నూనె అనిల్ యాదవ్ డిమాండ్ చేశారు.

బుధవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ భారత దేశానికి ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధిస్తే నిజాం నిరంకుశ పాలన లో ఉన్న తెలంగాణ ప్రాంతానికి సెప్టెంబర్ 17 న స్వాతంత్ర్యం వచ్చింది అని తెలిపారు.నిజాం నిరంకుశ పాలన లో తెలంగాణ ప్రజలు నరకం చవిచూశారు అని, రకరకాల పన్నులతో పాటు ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చుకు తిన్నారని, విచ్చల విడిగా మత మార్పిడిలకు పాల్పడి ఎదురు తిరిగిన ప్రజలను చిత్రహింసలకుగురిచేశారని, మహిళల మాన ప్రాణాలకు భంగం కలిగించారని, చివరికి తెలంగాణ ప్రాంతాన్ని పాకిస్థాన్ లో కలుపడానికి కుట్రలు పన్నిన నిజాం నవాబు ధాష్టీకాలను అప్పటి భారత ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేక చొరవ చూపి ఆపరేషన్ పోలో ద్వారా నిజాం నవాబు మెడలు వంచి తెలంగాణ కు విముక్తి కల్పించాడని అలాంటి ప్రాముఖ్యత కలిగిన సెప్టెంబర్ 17 న ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించక పోవడం వెనుక కేవలం ముస్లిం ఓటు బ్యాంకు, మజ్లిస్ పార్టీ ఒత్తిడి కారణం అని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా ఈ ఉత్సవాలను అధికార లాంఛనాలతో నిర్వహిస్తూ తెలంగాణ విమోచనోద్యమంలో అసువులు బాసిన అమర వీరుల కు ఘన నివాళులు అర్పించడం జరుగుతుంది అని తెలిపారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి తెలంగాణ ప్రజల మనోభావాలను, ఆత్మ గౌరవాన్ని కాపాడుతామని తెలిపారు.

## సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు

**సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు...**





**పరకాల సెప్టెంబర్ 16 ప్రజాజ్యోతి :** తెలంగాణలో నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను ప్రజలు క్షమించరని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణంలోని అమరధామం వద్ద తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణలో వీరోచిత పోరాటం సాగిందన్నారు. నిజాం పాలనలో ప్రజలు దోపిడీ, దౌర్జన్యాలకు గురవగా, వెట్టి చాకిరీ విముక్తి, భూమి, స్వేచ్ఛ కోసం రైతాంగం పోరాడిందని గుర్తు చేశారు. తెలంగాణలోని సుమారు 4 వేల గ్రామాలను విముక్తి చేసి, వేలాది ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు ఉద్యమానిదేనని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంతో సంబంధం లేని శక్తులు నేడు ఆ ఉద్యమ చరిత్రను తమ సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ విమోచన కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించే విషయంలో గత ప్రభుత్వాలు ప్రజలను నిరాశపరిచాయని, ఈ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయడం చారిత్రక అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, పరకాల మండల కార్యదర్శి దుప్పటి సాంబయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొట్ల చక్రపాణి, పట్టణ నాయకులు శ్రీకాంత్, బొచ్చు కళ్యాణ్, బొచ్చు ఆదాం, ఈశ్వర్, బొజ్జ హేమంత్, సీపీఐ నాయకురాలు ఉమాతో పాటు ఉభయ వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**వెంకటాపురం సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** వివిధ రుగ్మతలతో ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎం ఆర్ఎఫ్)ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలో భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. 13 మంది లబ్ధిదారులు సోమ చంద్రశేఖర్ 30 వేలు,ఎట్టి ప్రవీణ్ 60 వేలు,సనుగొండ శ్రీవల్లి 10,500, చిట్టెం మహేశ్వరి 60 వేలు,చిక్కుళ్ళ నాగమణి 23 వేలు, పోలిన శ్రీనివాసరావు 40 వేలు,మాటూరి దామోదర్ రావు 19 వేలు, కాల్వ నాగేశ్వరరావు 14,500, యాలం నందిని 32 వేలు, యాసం మోహన్ రావు 23 వేలు, అట్టం సత్యనారాయణ 60 వేలు, కొండగోని చక్రపాణి 60 వేలు,కోరం వెంకటేష్ 60 వేలు మొత్తం రూ.4 లక్షల 92 వేల విలువగల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో వైద్య చికిత్స పొందిన పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, పిఎసిఎస్ చైర్మన్ చిడెం మోహన్ రావు,ములుగు జిల్లా ఉపాధ్యక్షులు ధనపనేని వెంకటేశ్వర్లు, యువ నాయకులు బాలసాని వేణు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తాటి సరస్వతి,యూత్ అధ్యక్షులు చిట్టెం సాయికృష్ణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిట్యాల సాగర్,మాజీ ఎంపీటీసీలు గార్లపాటి రవి,కొండపర్తి సీతాదేవి,సీనియర్ నాయకులు కాల్వ సుందర్రావు,మద్దుకూరి ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్‌ను దూషించిన అమర ప్రసాద్‌ను అరెస్టు చేయాలి

**– అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు రాస మల్ల మల్లేష్**



**రఘునాథపల్లి, సెప్టెంబర్ 16( ప్రజాజ్యోతి) :** భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలని జనగామ జిల్లా అంబేద్కర్ సంఘ జిల్లా నాయకుడు రాసమల్ల మల్లేష్ హెచ్చరించాడు. ఆయన రచించిన 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని నిలిపివే యాలని కోరారు. బుధవారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేం ద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో రాసమల్ల మల్లేష్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ఎవరైనా కించపరిచేలా మాట్లాడితే అంబేద్కర్ వాదుల ఆగ్రహానికి గురి కావాల్సి దేనని హెచ్చరించారు. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్రను గుర్తించకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పుస్తక ప్రచురణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌వాదుల హెచ్చరిక అంబేద్కర్‌పై భవిష్యత్‌లో ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే అంబేద్కర్ వాదుల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కో వాల్సి వస్తుందని మల్లేష్ హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఎనమల్ల సత్యనారాయణ, నరసింగ రాజు, కొంద్ర లింగస్వామి, మాటూరి శివ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి పరవశంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు..

**శివాజీ యువసేన ఆధ్వర్యంలో మహా అన్నదానం..**



**పరకాల సెప్టెంబర్ 16 ప్రజాజ్యోతి :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివాజీ యువసేన గౌరవాధ్యక్షులు ఆర్.పి. జయంత్‌లాల్ ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ నాగబండి విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా శివాజీ యువసేన ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. మట్టి వినాయకుడిని ఏర్పాటు చేయడం, పర్యావరణహిత ప్లేట్లను వినియోగించడం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. యువత మరిన్ని సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నదాతలు సూర రిషిత, రవి, శివాజీ యువసేన నాయకులు కిరణ్, విజయ్, రవి, తిరుపతి, రాజేష్, అఫ్రోజ్, నాగరాజు, కాసిం, వంశీ, రాజు, ఆనంద్, అర్జున్, జిల్లెల్ల రాజకుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారుల ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో కీలకం

**రామరాజుపల్లి సర్పంచ్ బోయిని మహేందర్**



**దేవరుప్పుల, సెప్టెంబరు 16 (ప్రజాజ్యోతి) :** చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం అందించాలని సర్పంచ్ బోయిని మహేందర్ అన్నారు. బుధవారం రామరాజుపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాధాన్యత, పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్ శ్రీదేవి, ఉపసర్పంచ్ లాగ్య నిర్మల వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు ఎల్.సవిత, కె.సంధ్య,ఇ.నాగమణి, మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

## నూతన సీఐకి కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు




**దేవరుప్పుల, సెప్టెంబరు 16 (ప్రజాజ్యోతి):** పాలకుర్తి సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భరత్ సుమన్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని, సమస్యలను శాంతి యుతంగా పరిష్కరించుకునేలా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేందుకు కృషి చేస్తామని సీఐ పేర్కొన్నారు.

కార్యక్రమంలో దేవరుప్పుల మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొంగరి ఉమేష్, రామరాజుపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతుల సురేష్ తదితరులతో పాటు స్థానిక ఎస్సై ఊర సుజన్ కుమార్ ఉన్నారు.

## సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి

**హనుమకొండ జిల్లా జాక్ అధ్యక్షుడిగా సనత్‌కుమార్ పటేల్ నియామకం**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 16, (ప్రజా జ్యోతి):** తెలంగాణ సర్పంచుల సంఘం జాక్--2026 సర్పంచుల సంఘం జాక్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమకారుడు విరసనోళ్ల శ్రీనివాస్‌గౌడ్ బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా శాతరాశి సనత్‌కుమార్ పటేల్‌ను నియమించారు. ఈ సందర్భంగా సనత్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని సర్పంచుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణతో పాటు గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సర్పంచుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం జాక్ ఆధ్వర్యంలో సమష్టిగా పోరాడుతామని తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీకాలంలో అందరి సహకారంతో సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## ఎద్దుల బండిని ఢీకొని మహిళ మృతి

**మరో వ్యక్తికి తీవ్ర గాయాలు..**
**పర్వతగిరి పోలీసులు కేసు నమోదు**



**పర్వతగిరి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** మండలంలోని శ్రీనగర్ క్రాస్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటనపై పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని ఎన్జీవో కాలనీకి చెందిన షేక్ రిజ్వానా (27), తన తల్లి షేక్ మున్నీ (51), అన్న ఫిరోజ్ (30)లు స్వగ్రామమైన ఏనుగల్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 15న సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో టూ 24 3082 నంబర్ గల హెచ్ ఎఫ్ డీలక్స్ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా శ్రీనగర్ క్రాస్ వద్ద రోడ్డుపై ఎద్దుల బండిని నిర్లక్ష్యంగా ఉంచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.దీంతో ద్విచక్ర వాహనం ఎద్దుల బండిని ఢీకొనడంతో షేక్ మున్నీ, ఫిరోజ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని తొలుత ఏనుగల్‌లోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి, అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ షేక్ మున్నీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన ఫిరోజ్‌ను మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని రోహిణి ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఎద్దుల బండి గడ్డపార తండాకు చెందిన భూక్య బాలు దిగా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై షేక్ రిజ్వానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి సంబంధించిన పరిస్థితులపై దర్యాప్తు చేపట్టారు.

## మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్‌కు కాంగ్రెస్ నేతల పరామర్శ

ఆరోగ్య పరిస్థితిపై ఆరా...త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి): సూర్యాపేట పట్టణంలోని పిల్లలమర్రి 12వ వార్డుకు చెందిన మాజీ ఎంపీటీసీ రాపర్తి శ్రీనివాస్ గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్ష్మాది ఆయనను పరామర్శించారు.శ్రీనివాస్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయనకు అవసరమైన సహాయ



సహకారాలు అందిస్తామని నాయకులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ కోడి నాగరాజు, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్, శ్రీ దండు మైసమ్మ దేవాలయ మాజీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుగులోతు నాగునాయక్, పడిదల రవికుమార్, స్థానిక నాయకులు సాదక్, కొండ వెంకన్న, సంద సైదులు, చిలుక ఆనంద్, చింత సైదులు, సురేష్, వెంకట్‌లాల్, చింతలూరు సతీష్, కృష్ణయ్య తాలింపు, మదగోని కేశవులు, చెరుకుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ ఎడమ కాలువ లో మహిళ మృతదేహం లభ్యం

సెప్టెంబర్ 16 వేములపల్లి (ప్రజాజ్యోతి) : మండల కేంద్రంలో గల సాగర్ ఎడమ కాలువ లో గోగువాని గూడెం సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం అఇంది. ఎస్ఐ డి. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అనంతరం ఏరియా ఆసుపత్రి కి తరలించామని తెలిపారు.



మహిళ ఆచూకీ తెలిసిన వారు వేములపల్లి పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు.

## కథల్‌గూడ సబ్ సెంటర్‌లో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

రికార్డుల నిర్వహణ, మందుల నిల్వపై ప్రత్యేక దృష్టి

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

డీఎంహెచ్ఓ రాహుల్

నల్గొండ, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి ): రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కథల్‌గూడ సబ్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. రాహుల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లోని రికార్డులు,



రిజిస్టర్లు, మందుల నిల్వ, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. విధుల్లో ఉన్న వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడి సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అన్ని రికార్డులు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ సూచించారు. అత్యవసర, ముఖ్యమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ సెంటర్ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందించాలని, ప్రజల ఆరోగ్య అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, ప్రభుత్వ ఆరోగ్య సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డా. రాహుల్ సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. నాగేష్, హెచ్ఈఈఓ అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

## ఈనెల 18, 19వ తేదీల్లో నల్లగొండలో జర్నలిస్టుల దీక్షలను విజయవంతం చేయండి..

నల్లగొండ నగర జర్నలిస్టులంత్తా దీక్షలలో భాగస్వాములు కావాలి

ఇంటి స్థలాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కదలిరండి..

ఈ 30 ఏళ్ల పోరాటంలో విజయమే లక్ష్యంగా కలిసి నడుద్దాం..

టీయూడబ్ల్యూజే ( ఐజేయు) జిల్లా కమిటీ పిలుపు..

నల్లగొండ, సెప్టెంబర్ 16, (ప్రజా జ్యోతి ): టీయూడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో ఈనెల 18,19వ తేదీల్లో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట జరిగే జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత 30 సంవత్సరాలుగా నల్లగొండ లో పనిచేసే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వకపోవడంతో జర్నలిస్టులు తీవ్ర నిరాశ నిస్పృహలతో ఉన్నారని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి చెందిన జర్నలిస్టులు ఇంటి స్థలంతో పాటు ఇల్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నల్లగొండ నగరంలో పనిచేస్తున్న జర్నలిస్టుల బాధలను ప్రభుత్వం ఇప్పటికైనా అర్థం చేసుకొని ఇంటి స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18,19వ తేదీల్లో రెండు రోజులపాటు జరిగే రిలే నిరాహార దీక్షలో నల్లగొండ పట్టణంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఫోటో జర్నలిస్టులు, వీడియో జర్నలిస్టులు, చిన్న పత్రికల జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 18వ తేదీన ప్రతిపక్ష పార్టీల నాయకులు దీక్షలకు సంఘీభావం తెలియజేస్తారని, 19వ తేదీన దీక్షా శిబిరాన్ని అధికార పార్టీ నేతలు ప్రజాప్రతిని సందర్శించి మద్దతు పలకనున్నారని తెలిపారు. నల్లగొండలో జరిగే దీక్షలకు జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద ఎత్తున వచ్చి సంఘీభావం తెలియజేయాలని కోరారు.

# గ్రామాల్లో గుప్పుమంటున్న నాటుసారా!

* తెల్లవారుజామునే తాగుడుకు తెర...!
* నాటుసారాకు బలవుతున్న యువత
* చిన్న వయసులోనే వితంతువులవుతున్న యువతులు
* సారా.. అంబర్.. పాన్ పరాగ్ — యువత జీవితాలతో చెలగాటం!
* మత్తులో మునిగిపోతున్న పల్లెలు
* తనిఖీలు తూతూమంత్రమేనా..?
* సారా విక్రయాలపై అధికారుల నిఘా ఎక్కడ..?

**పల్లెల్లో నాటుసారా జోరు పెరుగుతోందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాలు, తండాల్లో కొన్నిచోట్ల ఉదయం నాలుగు గంటల నుంచే సారా విక్రయాలు సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మద్యం మత్తుకు యువత బానిసలుగా మారుతుండటం తో కుటుంబాల్లో ఆందోళన నెలకొంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

తుంగతుర్తి, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి):



యువత జీవితాలపై మత్తు ప్రభావం

చిన్న వయసులోనే మద్యం, నాటు సారాకు అలవాటు పడుతున్న యువతలో కొందరు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. మద్యం వినియోగం కారణంగా కుటుంబ ఆర్థిక పరిస్థితులు దెబ్బతినడంతో పాటు భార్యాభర్తల మధ్య విభేదాలు, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయని అంటున్నారు. కొన్ని కుటుంబాల్లో యువకులు మృత్యువాత పడటంతో వారి భార్యలు చిన్న వయసులోనే వితంతువులుగా మారుతున్న విషాద పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

### సారా ఒక్కటే కాదు.. పొగాకు ఉత్పత్తులూ ప్రమాదమే

నాటు సారాతో పాటు అంబర్, పాన్ పరాగ్ తదితర పొగాకు ఉత్పత్తులను నమలడం యువతలో అలవాటుగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం నోటి క్యాన్సర్ సహా అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే.

### తెల్లవారుజామునే మత్తు వాతావరణం

కొన్ని గ్రామాలు, తండాల్లో తెల్లవారుజామునే సారా విక్రయాలు ప్రారంభమవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులకు వెళ్లాల్సిన యువకులు సైతం ఉదయాన్నే మద్యం సేవిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో పని సామర్థ్యం తగ్గడం, కుటుంబ ఆదాయంపై ప్రభావం పడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తనిఖీలు ఎక్కడ..?

నాటుసారా తయారీ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ అవి "తూతూమంత్రంగానే ఉంటున్నాయంటూ" కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు అమ్యామ్యాలకు లొంగి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

### యువతను కాపాడాల్సిన బాధ్యత ఎవరిది..?

పల్లెల్లో నాటుసారా, అక్రమ మద్యం, పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్, పోలీస్, వైద్య, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అక్రమ విక్రయాలపై నిరంతర నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### మత్తు కోసం ఒక్కరోజు పెట్టే ఖర్చు కంటే...

ఆ మత్తు వల్ల కుటుంబం చెల్లించే మూల్యం ఎన్నోరెట్లు ఎక్కువ.

ఇది కేవలం సారా సమస్య కాదు... ఒక తరం భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న!

## అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలి

టెక్నాలజీని జ్ఞానం,లక్ష్య సాధనకు ఉపయోగించాలి

విద్యార్థి దశలో వేసుకునే పునాదులే భవిష్యత్ విజయాలకు బాటలు

పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎక్స్‌పర్ట్ టాక్

సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ

సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి): విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా క్రమశిక్షణతో నిరంతరం



కృషి చేయాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ సూచించారు.విద్యార్థి దశలో వేసుకునే మంచి పునాదులే భవిష్యత్తులో విజయాలకు బాటలు వేస్తాయని అన్నారు.సూర్యాపేటలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన 'ఎక్స్‌పర్ట్ టాక్' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని,దానిని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు.చదువు కేవలం ఉద్యోగం పొందేందుకు మాత్రమే కాకుండా జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునే సాధనమని పేర్కొన్నారు.పీఎం శ్రీ పాఠశాలగా ఎంపిక కావడం విద్యార్థులకు లభించిన మంచి అవకాశమని,పాఠశాలలో అందుబాటులో ఉన్న విద్యా వసతులు,ఉపాధ్యాయుల బోధనను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.మహానుభావులు,గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు.కలలు కనడంతో పాటు వాటిని సాకారం చేసుకునేందుకు క్రమశిక్షణతో సాధన చేయాలని సూచించారు.ఆత్మన్యూనతా భావాన్ని విడిచిపెట్టి ఆత్మవిశ్వాసంతో లక్ష్యాల వైపు అడుగులు వేయాలని చెప్పారు.తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు పాఠశాలకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

### టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా,సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థుల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ తెలిపారు.అయితే సోషల్ మీడియా ప్రభావంతో చెడు అలవాట్లకు లోనుకాకుండా టెక్నాలజీని చదువు,జ్ఞానం, నైపుణ్యాభివృద్ధి,లక్ష్య సాధనకు ఉపయోగించుకోవాలని సూచించారు.క్రమశిక్షణ,పట్టుదల,నిరంతర సాధనతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని అన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు సమాజానికి సేవ చేసే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని ఎస్పీ ఆకాంక్షించారు.తమ ప్రతిభను సమాజ ప్రగతికి ఉపయోగించే స్థాయికి ఎదగాలని సూచించారు.

### మహిళలు,బాలికల రక్షణకు పోలీసుల కృషి

మహిళలు,బాలికల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ తెలిపారు.సమస్యలు ఎదురైనప్పుడు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.షీ టీమ్స్,భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.మహిళలు,బాలికలకు అండగా నిలిచేలా పోలీస్ శాఖ పనిచేస్తోందన్నారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు.అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, పిన్,పాస్‌వర్డ్,బ్యాంకు వివరాలు వెల్లడించవద్దని తెలిపారు.ఉచితాల పేరుతో వచ్చే సందేశాలు,అనుమానాస్పద లింకులు, ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని




ఎవరైనా చెబితే అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

### డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులు మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యం, చదువు, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ,మంచి లక్ష్యాలు కలిగిన వారితో స్నేహం చేయాలని సూచించారు.తోటి విద్యార్థులను గౌరవిస్తూ స్నేహపూర్వక వాతావరణంలో ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్,సీఐ వెంకటయ్య,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్,సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐలు యాదవేందర్ రెడ్డి, సాయిరాం, హరికృష్ణ, భరోసా ఎస్ఐ మౌనిక, షీ టీం ఎస్ఐ నీలిమ, పాఠశాల హెడ్‌మాస్టర్ గోలి పద్మ, పీడీ విశ్వజ్ఞాచారి, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు సునీత,సుమతి, వెంకటేశ్వర్లు,శ్రీనివాస్‌రావు,సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి..

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

17న నల్గొండలో ఘనంగా వేడుకలు..

ముఖ్యఅతిథిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ..

నల్గొండ సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి ): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 17న (గురువారం) నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల





మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. బుధవారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 10 గంటలకు మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది ఉదయం 9.30 గంటలకే హాజరు కావాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే వారికి తాగునీరు, టెంట్లు, కుర్చీలు, విద్యుత్ సరఫరా, పరిశుభ్రత, ప్రజా ప్రసార వ్యవస్థ, ప్రథమ చికిత్స తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం మంత్రి ప్రజలను ఉద్దేశించి సందేశం ఇవ్వనుండగా, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వేడుకలకు పోలీసుల తరఫున గౌరవ వందనం, బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయక కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, డీఆర్వో దశరథ్, ఆర్డీవో వై. అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సేవే లక్ష్యం

గరిడేపల్లి,సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు గరిడేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.కాచవారిగూడెం,కాల్వ పల్లి,రాయిని గూడెం,కీతవారిగూడెం, అప్పన్నపేట,అబ్బిరెడ్డిగూడెం,లక్ష్మీ పురం,సర్వారం గ్రామాల్లో వినాయక



విగ్రహాలను పంపిణీ చేసి,మండపాల్లో ప్రత్యేక పూజలు నిర వ్యహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ ఆరేళ్లుగా వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని, ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమా రు 400 విగ్రహాలను అందించినట్లు తెలిపారు.గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలు, యువత,స్థానిక నాయకుల సమస్యలను తెలుసుకుంటున్నామని,ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు,ఉత్సవ కమిటీ సభ్యులు,ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

# డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు ఘన సన్మానం

♦ చందూర్ మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి)** చందూర్ మండలంలో మండల అభివృద్ధి అధికారి నీలావతి, మండల ప్రత్యేక అధికారి రజిత ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన కారేగాం తాండా సర్పంచ్ డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌ను మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తూనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ పొందడం అభినందనీయమని తెలిపారు. డాక్టరేట్ సాధించిన డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ఏ.ఈ. గోపి, క్రైఫ్, కేదేశ్వరి, ఎం.పి.ఓ. శ్రీనివాస్, సర్పంచులు మాధవి రెడ్డి, రవి సంజీవ్ తదితరులు పాల్గొని డాక్టర్ రామావత్ లాల్‌సింగ్‌ను అభినందించారు.

# ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు

♦ 18న అండర్-17, 19న అండర్-14 విభాగాల్లో పోటీలు

**కామారెడ్డి టౌన్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల స్థాయి రెజ్లింగ్ (ఫ్రీస్టైల్) ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర స్థాయి పోటీలలో నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులను ఎంపిక చేసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎంపిక పోటీలు నిజామాబాద్ నగరంలోని డి ఎస్ ఏ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో నిర్వహించనున్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 9 గంటలకు ఖచ్చితంగా రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న అర్హత కలిగిన విద్యార్థులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

**18న అండర్-17 ఎంపికలు**

అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో రెజ్లింగ్ ఎంపిక పోటీలు ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నారు. ఈ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి 1వ తేదీన లేదా ఆ తర్వాత జన్మించిన వారై ఉండాలి. వయస్సుకు సంబంధించిన అర్హతలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులు సూచించారు.

**19న అండర్-14 పోటీలు**

అండర్-14 బాలురు, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్నారు. ఈ విభాగానికి 2013 జనవరి 1వ తేదీన లేదా ఆ తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు.

**బోనఫైడ్, ఆధార్ తప్పనిసరి**

ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో కూడిన అసలు బోనఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ కూడా వెంట తీసుకురావాలని తెలిపారు. నిర్ణీత సమయమైన ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని, ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు పోటీల్లో పాల్గొనే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఒక పాఠశాల నుంచి ఒక బరువు కేటగిరీకి ఒక విద్యార్థి మాత్రమే హాజరు కావాలని నిర్వాహకులు పేర్కొన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా సరైన స్పోర్ట్స్ కిట్ లేదా రెజ్లింగ్‌కు అనువైన క్రీడా దుస్తులతో హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే ప్రతిభావంతులైన రెజ్లింగ్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నందున ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ జి ఎఫ్ నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాల కోసం ఎస్ జి ఎఫ్ ప్రతినిధులను సంప్రదించాలని తెలిపారు. ఎస్ జి ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బి. అలివేని మంగ, ఎస్ జి ఎఫ్ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఈ. శ్రీధర్ ఆధ్వర్యంలో ఎంపిక పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివరాల కోసం సంతోష్ పి.డి. -- 7893732228, జిల్లా కార్యదర్శి బి. అలివేని మంగ -- 9494893791 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

# వెట్టి చాకిరి విముక్తికి కులమతాలకతీతంగా పోరాటం

♦ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో రైతులకు లక్షల ఎకరాల భూ పంపిణీ ♦ సదస్సులో ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్





**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి):** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తెలంగాణ ప్రాంతంలో నిజాం పాలనలో దొరలు, భూస్వాములు, పట్వారీలు, దేశ్‌ముఖ్‌ల అరాచకం కొనసాగిందని ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రజలు, రైతులు సాయుధులై తిరగబడి పోరాటం చేశారని అన్నారు. కులమతాలకు అతీతంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చరిత్రలో నిలిచిపోయిందని తెలిపారు. మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం లక్ష్యాలు--నేటి పరిస్థితి' అనే అంశంపై నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ అప్పట్లో నిజాంతోపాటు భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాల భూమి ఉండేదన్నారు. ఆ భూముల్లో పనిచేసేందుకు ప్రజలను, రైతులను వెట్టి చాకిరీకి ఉపయోగించుకునేవారని తెలిపారు. వెట్టి చేయబోమని ఎదురు తిరిగిన వారిపై తీవ్రంగా దాడులు చేసేవారని గుర్తుచేశారు. ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో దొరలపై తిరుగుబాటు ప్రారంభమైందన్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న గుడిసెలు, కారం పొడి, చీపురు కట్టలు వంటి వాటితో పాటు సుమారు 10 వేల మందికిపైగా రైతులు, ప్రజలు తుపాకులు చేతబట్టి సైన్యంగా ఏర్పడి పోరాటం చేసినట్టు తెలిపారు. ఈ పోరాటంలో సుమారు 400 మంది ప్రజలు చనిపోయారని చెప్పారు. ఈ పోరాటం ఫలితంగా 'దున్నేవాడికే భూమి' అనే నినాదం వచ్చిందని, ఈ క్రమంలో 10 లక్షల ఎకరాలకు పైగా భూమిని రైతులకు కమ్యూనిస్టులు పంపిణీ చేశారని తెలిపారు. ఈ పోరాటంలో అనేక మంది ముస్లింలు సైతం ప్రాణాలు కోల్పోయారని, ప్రముఖులుగా షోయబుల్లాఖాన్, షేక్ బందగీ వంటి వారు ఉన్నారని తెలిపారు. కులమతాలకు అతీతంగా స్వేచ్ఛ కోసం ప్రజలు పోరాటం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వేచ్ఛ కోసం నాడు జరిగిన పోరాటం తర్వాత కూడా సమసమాజం ఏర్పడలేదన్నారు. సామాజిక న్యాయం అందరికీ అందని పరిస్థితి ఉందని తెలిపారు. డబ్బున్న వారికి ఒక న్యాయం, డబ్బు లేని వారికి మరో న్యాయం అన్నట్టుగా వ్యవస్థ మారిందని విమర్శించారు. చివరకు దేవుడి వద్ద కూడా వివక్షను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. సమాన హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్ రావు అధ్యక్షత వహించగా డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, పెన్షనర్స్ యూనియన్ నాయకులు ఈవీఎల్ నారాయణ, శిర్ప హనుమాన్లు, ప్రసాద్, సాంబశివరావు, సిర్ప లింగయ్య ఆలపించిన పాటలు శ్రోతలను అలరించాయి.

# కల్లు ప్యాకెట్లపై ఎక్స్ పైరీ వివరాలు తప్పనిసరిగా ముద్రించాలి

♦ ఫుడ్ సేఫ్టీ అధికారికి ఆర్ఎస్ పీ వినతి



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్లు డిపోలు, అలాగే జిల్లా కేంద్రంలోని కల్లు విక్రయ కేంద్రాల్లో సరఫరా చేస్తున్న కల్లు ప్యాకెట్లపై ఎక్స్ పైరీ తేదీ, తయారీ తేదీ, అందులో ఉపయోగించిన పదార్థాల పూర్తి వివరాలు, ఆల్కహాల్ శాతం వంటి సమాచారాన్ని ముద్రించడం లేదని, వాటిని తప్పనిసరిగా ముద్రించాలని కోరుతూ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు మాట్లాడుతూ కల్లు ప్యాకెట్లలో వినియోగదారులకు వారు తీసుకుంటున్న పానీయంలో ఎంత శాతం ఆల్కహాల్ ఉందో, చక్కెర శాతం ఎంత ఉందో, అది సహజసిద్ధంగా తాటి లేదా ఈత చెట్ల నుంచి సేకరించిన కల్లునా, లేక కృత్రిమంగా తయారు చేసినదా అనే విషయాలు తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో విక్రయించే ప్రతి మత్తు పదార్థంపై "మత్తు పదార్థాలు ఆరోగ్యానికి హానికరం" అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రిస్తుంటారని, అయితే కల్లు ప్యాకెట్లపై అలాంటి హెచ్చరికలు లేకపోవడం సరైంది కాదన్నారు. వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా కల్లు ప్యాకెట్లపై పదార్థాల వివరాలు, ఆల్కహాల్ శాతం, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీతో పాటు ఆరోగ్య హెచ్చరికను కూడా తప్పనిసరిగా ముద్రించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న కల్లు డిపోల నుంచి నమూనాలు (శాంపిల్స్) సేకరించి ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం పరీక్షలు నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ పీ పార్టీ నేతలు పీట్ల. నరేష్, గోపాల్ సింగ్ ఠాగూర్, సుర్యపాల్, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# గణనాథుని సన్నిధిలో భక్తి స్వరాలు

♦ సంగారెడ్డి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భజనలు



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :** సంగారెడ్డి నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక భజన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా వినాయకుని సన్నిధిలో నిర్వహించిన భజన



కార్యక్రమంతో పట్టణంలోని మంజీరా నగర్ మెయిన్ రోడు భక్తిమయంగా మారింది. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథునికి నైవేద్యం సమర్పించిన కమిటీ సభ్యులు అనంతరం భవాని భజన మండలి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో స్వామివారిని కొలిచారు. గణపతి నామస్మరణతో మార్మోగగా, భక్తులు ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా భజన కార్యక్రమంలో పాల్గొని గణనాథుని కృపకు పాత్రులయ్యారు. భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ భజన కళాకారులు శాంతి కుమార్, శ్రీశైలం, నర్సింలు, మహేష్, కమిటీ సభ్యులు మాణిక్ ప్రభు, దత్తాత్రి, సాయినాథ్, శ్రీశైలం, పెంటయ్య, సురేష్, ఆంజనేయులు, రాము, శేఖర్, రమేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# శివపార్వతుల కల్యాణానికి ఆహ్వానం



**అమీన్‌పూర్(ప్రజాజ్యోతి)** కిష్టారెడ్డిపేట్ పరిధిలోని రెయిన్ భో మెడల్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించనున్న శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి అమీన్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్‌ను కాలనీ సొసైటీ నాయకులు ఆహ్వానించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. సనాతన ధర్మం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు మూలాధారమన్నారు. శివపార్వతుల కల్యాణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిభావాన్ని, ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయన్నారు. అన్నదాన కార్యక్రమాలు సేవాభావం, సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కిష్టారెడ్డిపేట్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సొసైటీ నాయకులు, ప్రతినిధులు, బీజేపీ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.

# పార్ట్‌టైమ్ టీచర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


♦ ఈ నెల 18లోగా దరఖాస్తులు సమర్పించాలి ♦ 19న డెమో, ఇంటర్వ్యూలు ♦ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:-** సంగారెడ్డి జిల్లా పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు/కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పార్ట్‌టైమ్ టీచర్లను నియమించేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4:00 గంటలలోగా చిట్కుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ ఉదయం 10:00 గంటలకు తమ విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజు తాజా ఫొటోలతో చిట్కుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమో మరియు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సమన్వయ అధికారి, టిజిఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్, చిట్కుల్ ను 9704550253, 9640382248 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# సాంకేతికతపై పట్టు సాధించాలి

♦ గీతం విద్యార్థులకు డాక్టర్ ఫణీంద్రబాబు బొబ్బా సూచన





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** బ్యాటరీల అధునాతన సాంకేతికతలపై విద్యార్థులు పట్టు సాధించి, ఇంటెలిజెంట్ బ్యాటరీ పరిజ్ఞానంతో వర్తమాన అవసరాలను అర్థం చేసుకుంటూ భవిష్యత్ సవాళ్లను అంచనా వేయాలని స్మార్ట్ ఎకో ఎలక్ట్రిక్ డ్రైవ్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ డాక్టర్ ఫణీంద్రబాబు బొబ్బా సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'బ్యాటరీ ఆరోగ్య పర్యవేక్షణ, పునర్వినియోగంలో ఏఐ, ఎంఎల్ వినియోగం'పై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. బ్యాటరీ ఆరోగ్య పర్యవేక్షణ, ఆరోగ్య స్థితి, మిగిలిన ఉపయోగకర జీవితం, ముందస్తు నిర్వహణ, పునర్వినియోగం వంటి అంశాలను ఆయన వివరించారు. వోల్టేజ్, కరెంట్, ఉష్ణోగ్రత, ఛార్జింగ్--డిశ్చార్జింగ్ సరళులను ఏఐ, మెషిన్ లెర్నింగ్ ద్వారా విశ్లేషించడం వల్ల బ్యాటరీ పనితీరు, భద్రతను మెరుగుపరచడంతోపాటు లోపాలను ముందుగానే గుర్తించవచ్చన్నారు. బ్యాటరీల గుర్తింపు, వర్గీకరణ, పదార్థాల పునరుద్ధరణలోనూ ఏఐ వినియోగంపై వివరించారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్. ముడిమేల సమక్షంలో స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి డాక్టర్ బొబ్బాను సత్కరించారు. కార్యక్రమాన్ని డాక్టర్ జి. శ్రీనివాస్, డాక్టర్ పి.వి. రామకృష్ణ సమన్వయం చేశారు.

**ప్రతిభను చాటేందుకు వేదిక**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో బోధనేతర సిబ్బంది సాంస్కృతిక ఉత్సవం--2026 ఉత్సాహంగా జరిగింది. విద్యాపరమైన ఆవిష్కరణ, పురోగతి కేంద్రం (సీఏఐఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు ప్రారంభించారు. ఉద్యోగులు తమలోని ప్రతిభను వెలికితీసి, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. సిబ్బంది వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం సిబ్బందిలో భాగస్వామ్యం, సహకారం, స్నేహభావాన్ని పెంపొందించేందుకు దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.



# దుబ్బాక అభివృద్ధికి ఏకమైన కుల సంఘాలు

• హిందూ ముస్లింలు భాయ్ భాయ్ అంటున్న దుబ్బాక ప్రజలు • రోడ్డు వెడల్పు విస్తరణకు శ్రీకారం

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి)** దుబ్బాక అభివృద్ధికి అన్ని కుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చాయి. గత కొన్ని నెలల క్రితం దుబ్బాక పట్టణంలో నడిబొడ్డున నూతన బొడ్రాయిని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్మించడం జరిగిన సంగతి అందరికీ తెలిసిందే, అందులో భాగంగా ఆనాడు గ్రామ కుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చి బొడ్రాయి పక్కన నుండి వాహనాలు వెళ్లేందుకు ఇరువైపులా రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఆనాటి నుండి ఈనాటి వరకు అన్ని కుల సంఘాలు బొడ్రాయి నిర్మాణం తర్వాత







పోచమ్మ నూతన ఆలయంపై దృష్టి చారించారు. దానితో బొడ్రాయి ఇరుపక్కల ఉన్న రోడ్డు వెడల్పు కార్యక్రమం నిలిచింది. నేడు దుబ్బాక పట్టణంలో భారీ గణనాథులు నెలకొల్పడంతో దుబ్బాక ఆనవాయితీగా విగ్రహాలన్నీ బొడ్రాయి చుట్టూ తిరుగుతూ నిమర్జనం జరుగుతుంటుంది. అందులో భాగంగా రోడ్డు ఇరుకుగా ఉన్నందున అన్ని కుల సంఘాలు దుబ్బాక ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు దుబ్బాక ఆయా కుల సంఘాలు పాల్గొని ఏకతాటిపైకి వచ్చి బొడ్రాయి నుండి ఎడమ సైడ్ 20 ఫీట్లు కుడి సైడ్ 20 ఫీట్ల వరకు రోడ్డు వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టాలని అన్ని కుల సంఘాలు ఏకతాటిపై వచ్చి తీర్మాలను చేసుకున్నారు. అనంతరం దుబ్బాక పట్టణం ఆయా కుల సంఘాల పెద్ద మనుషులు కొబ్బరికాయలు కొట్టి రోడ్డు వెడల్పు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో దుబ్బాక ప్రాంత ప్రజలంతా సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పు కార్యక్రమానికి సహకరించిన ముస్లిం సోదరులకు దుబ్బాక కుల సంఘాలకు , దుబ్బాక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ వంద శాతం టీకాలు అందించాలి

• జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిహెచ్ ధనరాజ్

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి):** అర్హులైన పిల్లలు, గర్భిణీ స్త్రీలకు వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిహెచ్. ధనరాజ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిట్టపల్లి సబ్‌సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌సెంటర్‌లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన మహిళలతో మాట్లాడి టీకాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీలకు ఇవ్వాల్సిన టీకాలు, చిన్నారుల ఎదుగుదల, గర్భిణీలు మరియు పిల్లలకు అవసరమైన పోషకాహారంపై అవగాహన కల్పించారు. 14 సంవత్సరాల వయసు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్‌ను నివారించేందుకు అందిస్తున్న టీకాలను కూడా అర్హులైన వారికి వంద శాతం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు డ్యూ లిస్టుల ప్రకారం అర్హులైన పిల్లలు, గర్భిణీలను గుర్తించి ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి టీకాలు వేయించాలని ఆదేశించారు.





**డ్రై డే కార్యక్రమం తప్పనిసరి**

ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని డాక్టర్ ధనరాజ్ సూచించారు. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు తదితర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. దోమల నివారణకు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, సమయపాలన పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఈ ఎన్ ఎం జయ, హెచ్ ఏ నాగేందర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు రాణి, సారవ్వ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17.. నాటి పోరాటం.. నేటి రాజకీయం

• విలీనమా.. విమోచనమా.. ప్రజా పాలన దినోత్సవమా?

• చరిత్రను మతం, రాజకీయాల కళ్లద్దాల్లో కాకుండా ప్రజల పోరాటాల కోణంలో చూడాల్సిందే

**దౌల్తాబాద్,సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్ 17** తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిన రోజు. ఒకవైపు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజా, రైతాంగ ఉద్యమాలు. మరోవైపు హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో చేర్చేందుకు జరిగిన రాజకీయ, సైనిక పరిణామాలు. వీటన్నింటి కూడలిలో నిలిచిన చారిత్రక ఘట్టం ఇది. అందుకే ప్రతి ఏడాది సెప్టెంబర్ 17 వచ్చిందంటే విలీనమా?, విమత పోరాటమా.. ప్రజా పోరాటమా? నాటి హైదరాబాద్ సంస్థానంలో నిజాం ముస్లిం పాలకుడు కావడం, జనాభాలో మెజార్టీ హిందువులు ఉండటం చారిత్రక వాస్తవమే. కానీ మొత్తం పోరాటాన్ని కేవలం హిందూ ముస్లిం ఘర్షణగా నిర్వచించడం చరిత్రలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను కుదించే ప్రమాదం ఉంది. నిజాం పాలనలో ప్రజాస్వామ్య హక్కుల కొరత, భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరీ, దొరల ఆధిపత్యం, రైతుల సమస్యలు వంటి అంశాలు తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రధాన నేపథ్యంగా నిలిచాయి. తెలంగాణ ప్రభుత్వ పాఠ్యాంశాల్లోనూ రైతాంగ పోరాటం రజాకార్లకు మాత్రమే వ్యతిరేకం కాదని, దొరల ఆధిపత్యం, భూసంబంధిత సమస్యలతోనూ ముడిపడి ఉందని వివరించారు. అదే సమయంలో రజాకార్ల హింస, గ్రామాలపై దాడులు, ప్రజలపై జరిగిన దౌర్జన్యాలు కూడా నాటి చరిత్రలో కీలక భాగమే. అందువల్ల సెప్టెంబర్ 17ను అర్థం చేసుకోవాలంటే నిజాం పాలన, రజాకార్ల పాత్ర, భూస్వామ్య వ్యవస్థ, రైతాంగ సాయుధ పోరాటం, భారత ప్రభుత్వ సైనిక చర్య. అన్నింటినీ కలిపి చూడాల్సి ఉంటుంది. మోచనమా?, సమైక్యతా దినమా? అనే చర్చ తెరపైకి వస్తోంది.

**పోరాటంలో మతాలకు అతీతంగా భాగస్వామ్యం**

తెలంగాణ రైతాంగ పోరాటానికి కమ్యూనిస్టు నాయకత్వం, ఆంధ్ర మహాసభ వంటి సంస్థల పాత్ర ఉంది. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి నాయకులతో పాటు మఖ్దూం మొహియుద్దీన్ వంటి ముస్లిం నాయకులు కూడా నిజాం వ్యతిరేక ఉద్యమంలో భాగమయ్యారు. అధికారిక తెలంగాణ విద్యా పాఠ్యాంశాలు కూడా మఖ్దూం మొహియుద్దీన్ పాత్రను ప్రస్తావిస్తున్నాయి. అందువల్ల నాటి పోరాటాన్ని కేవలం ఒక మతానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంగా ముద్ర వేయడం కంటే. ప్రజల హక్కులు, భూమి, భుక్తి, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం వంటి అంశాల నేపథ్యంలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ఆపరేషన్ పోలో ఏం జరిగింది?**

1947 ఆగస్టు 15న భారత్ స్వతంత్రం పొందినప్పటికీ హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో చేరలేదు. రాజ్యాంగ సభ చర్చల్లోనూ 1947 ఆగస్టు నాటికి హైదరాబాద్ భారత్‌లో చేరని ప్రధాన సంస్థానాల్లో ఒకటిగా నమోదైంది. ఈ పరిస్థితుల్లో రాజకీయ చర్చలు, ఉద్రిక్తతలు, రజాకార్ల కార్యకలాపాలు కొనసాగాయి. చివరకు 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్య ప్రారంభించింది. సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటుకు అంగికరించడంతొ సైనిక చర్య ముగిసింది. తెలంగాణ ప్రభుత్వ చరిత్ర పాఠ్యాంశాలు సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైందని పేర్కొంటున్నాయి. అయితే భారత సైన్యం ఎక్కడా నిజాం సేనతో యుద్ధం చేయలేదు అనే వాదన చారిత్రక రికార్డుతో సరిపోలదు. ఆపరేషన్ పోలో ఐదు రోజుల సైనిక చర్య కాగా, కొన్ని ప్రాంతాల్లో హైదరాబాద్ దళాల నుంచి ప్రతిఘటన చోటుచేసుకుంది. కాబట్టి దీనిని కేవలం రాజకీయ ఒత్తిడితో జరిగిన లొంగుబాటుగా మాత్రమే చెప్పడం కూడా పూర్తి చిత్రాన్ని ఇవ్వదు.

**సెప్టెంబర్ 17తో నిజాం పాలన పూర్తిగా ముగిసిందా?**

ఇక్కడే మరో చారిత్రక సంక్లిష్టత ఉంది. సెప్టెంబర్ 17 తర్వాత హైదరాబాద్ సంస్థానం భారత ఆధీనంలోకి వచ్చినప్పటికీ, నిజాం వెంటనే సాధారణ అర్థంలో పాలకుడుగా పూర్తిగా అంతరించిపోలేదు. భారత ప్రభుత్వ ఆధీనంలోని మార్పిడి వ్యవస్థలో ఆయన రాజ్‌ప్రముఖ్‌గా కొనసాగారు. 1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ భారత రాజ్యాంగ వ్యవస్థలో భాగమైంది. 1952లో ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడింది. అందువల్ల సెప్టెంబర్ 17ను ఒకే ఒక్క కోణంలో నిర్వచించడం కంటే. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లోకి వచ్చిన కీలక తేదీగా, తెలంగాణ ప్రజా పోరాటాల చారిత్రక మలుపుగా చూడటం మరింత సమగ్ర దృక్పథం.

**విలీనమా... విమోచనమా?**

విలీనం అనే పదం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరిన రాజకీయ రాజ్యాంగ పరిణామాన్ని ముందుకు తెస్తుంది. విమోచనం అనే పదం నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలు బయటపడిన భావనను ప్రతిబింబిస్తుంది. రెండు పదాల వెనుకా వేర్వేరు చారిత్రక, రాజకీయ దృక్పథాలున్నాయి. ఇదే కారణంగా తెలంగాణలో సెప్టెంబర్ 17కు వేర్వేరు పేర్లు వచ్చాయి. 2024లో తెలంగాణ ప్రభుత్వం దీనిని ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించింది. ప్రభుత్వం వెల్లడించిన వివరణలో విలీనం, విమోచనం అనే వివాదాలకు బదులుగా ప్రజల పాత్రను కేంద్రంగా ఉంచాలనే ఉద్దేశాన్ని పేర్కొంది.

**చరిత్రకు రాజకీయ రంగు ఎందుకు?**

సెప్టెంబర్ 17 చరిత్ర కంటే దానికి పెట్టే పేరు ఇప్పుడు రాజకీయ చర్చగా మారుతోంది. ఒక వర్గం విమోచన అనే పదాన్ని ముందుకు తెస్తే, మరో వర్గం విలీనం లేదా ప్రజా పాలన అనే పదాలను ప్రాధాన్యంగా చూస్తోంది. ప్రతి రాజకీయ శక్తి తన భావజాలానికి అనుగుణంగా ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తోంది. ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. చరిత్రను గుర్తు చేసుకుంటున్నామా? లేక చరిత్రను రాజకీయంగా ఉపయోగించుకుంటున్నామా? నాటి పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన రైతులు, ఉద్యమకారులు, సామాన్య ప్రజల త్యాగాలను గుర్తు చేసుకోవడం ఒక అంశం. ఆ త్యాగాలను ప్రస్తుత రాజకీయ పోరాటాలకు



అనుగుణంగా అన్వయించుకోవడం మరో అంశం. ఈ రెండింటినీ కలిపేస్తే చరిత్రపై అవగాహన కంటే రాజకీయ వాదోపవాదాలే మిగిలే ప్రమాదం ఉంది.

**నిజాం మాత్రమేనా ? దొరల వ్యవస్థ సంగతేంటి ?**

తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను పరిశీలిస్తే నిజాం పాలనతోపాటు గ్రామీణ భూస్వామ్య వ్యవస్థ, దొరల ఆధిపత్యం, వెట్టిచాకిరీ, భూమి సమస్యలు కూడా ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. తెలంగాణ ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కూడా రజాకార్లకు మద్దతుగా కొందరు దొరలు వ్యవహరించారని, రైతాంగ పోరాటం భూసంబంధిత మార్పుల కోసం కూడా కొనసాగిందని పేర్కొంటున్నాయి. అందుకే నాటి చరిత్రను కేవలం ఒక మతం పాలన మరో మతం విముక్తి అనే సరళమైన సమీకరణంలో పెట్టడం చరిత్రలోని వర్గ, కుల, భూసంబంధిత వాస్తవాలను పక్కన పెట్టే అవకాశం ఉంది.

**చరిత్ర నుంచి నేర్చుకోవాల్సింది ఏమిటి?**

సెప్టెంబర్ 17 ఒక తేదీ మాత్రమే కాదు. అది రాచరికం నుంచి ప్రజాస్వామ్యానికి జరిగిన పరివర్తనలో కీలక మలుపు. రైతాంగ పోరాటం, ప్రజా ఉద్యమాలు, రజాకార్ల హింస, భారత సైనిక చర్య, నిజాం లొంగుబాటు, అనంతర పరిపాలనా మార్పులు.. ఇవన్నీ కలిసిన సంక్లిష్ట చరిత్ర. చరిత్రలో మంచి చెడు రెండూ ఉంటాయి. మంచి నుంచి స్ఫూర్తి పొందడం. తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం ప్రజాస్వామ్య సమాజానికి అవసరం. కానీ చరిత్రను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా మలచడం మాత్రం భవిష్యత్ తరాలకు అసంపూర్ణమైన చిత్రాన్ని అందించే ప్రమాదం ఉంది.

**ప్రజలే అసలు కేంద్రబిందువు..**

సెప్టెంబర్ 17ను ఎవరు తమ రాజకీయ కార్యక్రమానికి ఉపయోగించుకున్నారు అన్నదానికంటే. నాటి పోరాటంలో సామాన్య ప్రజలు ఏం కోల్పోయారు? ఏం సాధించారు? వారి భూమి, భుక్తి, స్వేచ్ఛ, గౌరవం ఎంతవరకు సాధ్యమయ్యాయి? అనే ప్రశ్నలు మరింత ప్రాధాన్యం కలిగినవి. చరిత్రను ఎవరికి అనుకూలంగా వారు చెప్పుకోవచ్చు. పేర్లు వేరైనా రాజకీయ భాష్యాలు మారినా సెప్టెంబర్ 17కు ఉన్న చారిత్రక ప్రాధాన్యం మాత్రం మారదు. నాటి పోరాటానికి నిజమైన గౌరవం.. చరిత్రను వక్రీకరించకుండా చెప్పడంలోనే ఉంది. ప్రజల త్యాగాలను రాజకీయ లాభనష్టాల తూకంలో వేయకుండా గుర్తు చేసుకోవడంలోనే ఉంది. సెప్టెంబర్ 17ను రాజకీయ పోటీకి మరో అస్త్రంగా మార్చడం కంటే ఆ రోజు దిశగా సాగిన ప్రజా పోరాటం, రైతాంగ ఆకాంక్షలు, ప్రజాస్వామ్య స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి అంశాలను భావితరాలకు పరిచయం చేయడం చరిత్రకు ఇచ్చే అసలైన గౌరవం.

## దళిత యువతిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకొని మోసం చేసిన నిందితుడిని అరెస్ట్ చేయాలి

• డిబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి)** దళిత యువతిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకుని కులం తక్కువని మోసం చేసిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ముత్యం పేట గ్రామంలో బుధవారం నాడు బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ముత్యంపేట గ్రామానికి చెందిన బీసీ యువకుడైన భానుచందర్ దళిత యువతిని ప్రేమించి స్నేహితుల సమక్షంలో కులహాంతర వివాహం చేసుకొని గజ్వేల్ లో కాపురం పెట్టి తల్లిదండ్రుల ఒత్తిడి మేరకు కులం తక్కువ అమ్మాయిని పెళ్లి చేసుకున్నవని ఒత్తిడి తో అమ్మాయిని వదిలేసి మోసానికి పరిపాడిన భానుచందును తక్షణమే ఎస్సీ ఎస్టీ అత్యాచారాల ఇందుకు చట్టం కింద నమోదైన కేసులో కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలు నిందితుడిపై కేసు నమోదు చేయాలని పోలీస్



స్టేషన్ చుట్టూ తిరిగిన దౌల్తాబాద్ పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. సిపి ఆదేశాల మేరకు ఎట్టకేలకు కేసు నమోదు చేసినప్పటికీ విచారణ పేరుతో నిందితుడిని అరెస్ట్ చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని దీంతో నిందితుడు గ్రామంలో దర్జాగా తిరుగుతున్నడని అన్నారు. బాధితురాలు వారి కుటుంబం మానసిక ఒత్తిడి కి గురవుతున్నారు. నిందితులను తక్షణమే చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపి నాయకులు సతీష్, నరసింహులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఇంకుడు గుంత ఏర్పాటు



**నంగునూరు, సెప్టెంబర్ 16( ప్రజా జ్యోతి):-** మండలపరిధిలో ని తిమ్మాయిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో బుధవారం రోజు ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, సర్పంచ్ చేర్యాల రాజు మాట్లాడుతూ.. వర్షపు నీటిని పొదుపు చేస్తూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలను సమర్థవంతంగా సంరక్షించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నీటి ప్రాముఖ్యతను గుర్తించి ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టాలని, ఉపాధి హామీ పథకం కింద ఈ ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం 35 వేల రూపాయలు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో ఉపాధ్యాయులు సుశాంత్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ తిరుపతి వార్డు సభ్యులు మురళి, నాయకులు జంగిటి స్వామి , తదితరులు పాల్గొన్నారు.

## పేద రెడ్డి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

**సిద్దిపేట, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి):-** అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి వైద్య ఖర్చుల నిమిత్తం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించారు. చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామనికి చెందిన పెండ్యాల రాజశేఖర్ రెడ్డి అనారోగ్యానికి గురై నడవలేని స్థితిలో ఉండగా సర్జరీ నిమిత్తం రంగదాంపల్లి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నాడు ఆర్థిక సహాయాన్ని అందించారు. సంఘం తరఫున పదిహేను వేల రూపాయలు, రూపాయలు, రెడ్డి మిత్రమండలి పక్షాన ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు సద్ది నాగారాజు రెడ్డి,



వెంకటేశ్వర రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి,అంకిళ్ల వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సింహ గర్జన యూత్ ఆధ్వర్యంలో

## ఘనంగా గణనాథునికి ప్రత్యేక పూజలు

• ఇరవై వ వార్షికోత్సవం సందర్భంగా భారీ వినాయక విగ్రహం ఏర్పాటు

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 16, (ప్రజా జ్యోతి):** సింహ గర్జన యూత్ ఆధ్వర్యంలో ఇరవై వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మిరుదొడ్డి మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ కింద ఏర్పాటు చేసిన ఇరవై అడుగుల భారీ గణనాథునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యూత్ సభ్యులు భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. భారీ వినాయక విగ్రహాన్ని దర్శించుకునేందుకు భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సింహ గర్జన యూత్ సభ్యులు మాట్లాడుతూ.. యువతలో ఐక్యతను పెంపొందించడంతోపాటు, ఆధ్యాత్మికత, సామాజిక సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యూత్ ఇరవై వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ఏడాది ఇరవై అడుగుల భారీ గణనాథుని విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు, యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. ఉత్సవాల సందర్భంగా యువత, గ్రామ ప్రజలు పరస్పర సహకారంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గణనాథుని ఆశీస్సులతో గ్రామ



ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుని దర్శించుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు స్థానికులు, యువత సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింహ గర్జన యూత్ అధ్యక్షుడు లింగాల సదానంద రెడ్డి, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, అంజి, కవిరాజ్, ప్రశాంత్, రమేష్, కార్తీక్, నరేష్, శివరెడ్డి, సంతు, అంజి, ధ్రువనేష్, భాను, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 30లోపు పంట నమోదు తప్పనిసరి

• నమోదు లేకుంటే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ఉండదు

• మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ

**కొండపాక, సెప్టెంబర్ 16:( ప్రజా జ్యోతి):-** కొండపాక మండలంలోని రైతులు తమ పొలాల్లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ సూచించారు. ఇందుకోసం ఆయా గ్రామాల్లో పంట నమోదు చేస్తున్న సర్వేయర్లను రైతులు సంప్రదించాలని తెలిపారు. రైతులు సర్వేయర్‌ను తమ పంట పొలం వద్దకు తీసుకెళ్లి, సాగు చేస్తున్న పంట వివరాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. సర్వేయర్ పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. పంట



వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసే అవకాశం ఉండదని అధికారులు తెలిపారు. కావున రైతులందరూ ఈ విషయాన్ని గమనించి ఈ నెల 30వ తేదీలోపు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించాలి..!

సర్పంచ్ చిందం పాండు

**నందిగామ, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్య ప్రామాణాలను మరింత పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సమన్యాయంతో పనిచేయాలని వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు అన్నారు. బుధవారం నందిగామ మండల పరిధిలోని వీర్లపల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళా సమైక్య సహాయ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## పద్మారావు కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- మాజీ పిఏస్సిఎస్ చైర్మన్ పద్మారావు తల్లి అంజమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే
- హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి



**కొత్తూరు సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి) :** పద్మారావు కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో మాజీ పిఏసిఎస్ చైర్మన్ పద్మారావు తల్లి అంజమ్మ దశదినకర్మ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పద్మారావు కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ పసుల బుచ్చయ్య, గూడూరు సర్పంచ్ దయానంద్ గుప్తా, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్, చేగూర్ సర్పంచ్ మంకాల శ్రీశైలం, వెంకమ్మగూడ సర్పంచ్ సర్పంచ్ అశోక్, కాంగ్రెస్ పార్టీ నందిగామ మండల అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్, మాజీ సర్పంచ్ జగన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లింగారం సురేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయ ప్రముఖులకు సన్మానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం హైకోర్టు ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించారు. న్యాయం, బాధితుల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్ ఎస్.ఎల్.శ్రీనివాసులు గౌడ్, పబ్లిక్ ప్లీడర్ సి.ఎస్.సుమన్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.విజయకుమారిలను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిహెచ్.సాంసంగ్ బాబు, మహమ్మద్ అక్తర్ షరీఫ్, సి.వి.నరసింహుడు, సంస్థ కోఆర్డినేటర్ జి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం

- నేడు ప్రతి గిరిజన తండాలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలి
- తలకొండపల్లి మండల బిఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు కోర్ర కృష్ణ నాయక్ పిలుపు




**తలకొండపల్లి సెప్టెంబర్ 16 (ప్రజాజోతి):** తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం నడిచిందని తలకొండపల్లి మండల బిఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు కోర్ర కృష్ణ నాయక్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తండాలు గ్రామపంచాయతీలలో కలిసి ఉండేవని, కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలన కల్పించారని తెలిపారు. గిరిజన బిడ్డల చదువు కోసం గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని, గిరిజన రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు వంటి పథకాలు అందించారని పేర్కొన్నారు. గిరిజనులకు 6శాతం ఉన్న రిజర్వేషన్లను 10శాతానికి పెంచి గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడారు. గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గిరిజనులను పట్టించుకోవడం లేదని, సంక్షేమ పథకాలు నిలిపివేశారని విమర్శించారు. కెసిఆర్ చేసిన సేవలను గిరిజన సమాజం ఎప్పటికీ మర్చిపోదని, నేడు ప్రతి తండాలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయన సేవలను కొనియాడాలని పిలుపునిచ్చారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో మోడల్ మార్కెట్‌లో తనిఖీ మాజీ కార్పొరేటర్ ముద్దం



**బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 16(ప్రజా జ్యోతి) :** ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా మోడల్ మార్కెట్ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ బుధవారం పర్యటించి ఓటర్ల వివరాల పరిశీలన, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ అమలు తీరును పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎవరు?

- ఎమ్మెల్యే చూపు ఎవరి వైపు..? ఎస్సీ రిజర్వేషన్‌తోనే సమస్యా..?
- చైర్మన్ ఎంపిక ఇంకా ఎప్పుడు..? గ్రూపు తగాదాల వల్ల ఆలస్యమా..?




**బషీరాబాద్, సెప్టెంబర్ 16ప్రజా జ్యోతి :** బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఎవరు..? చైర్మన్ ఎంపిక ఎప్పుడు జరుగుతుంది..? అనే అంశంపై మండల ప్రజల్లో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ వచ్చినట్లు పత్రికల్లో ప్రచురితం కావడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇతర మండలాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ల ఎంపిక పూర్తవుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో బషీరాబాద్ మార్కెట్ కమిటీ విషయంలో మాత్రం ఇంకా స్పష్టత రాకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చైర్మన్‌గా ఎవరి పేరును ఖరారు చేస్తారు..? ఎమ్మెల్యే చూపు ఎవరి వైపు ఉంది..? అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఎస్సీ రిజర్వేషన్ రావడమే చైర్మన్ ఎంపిక ఆలస్యానికి కారణమా..? స్థానికంగా ఉన్న రాజకీయ గ్రూపుల మధ్య విభేదాల ప్రభావంతోనే నిర్ణయం ఆలస్యం అవుతోందా..? లేక రిజర్వేషన్‌లో ఏమైనా మార్పు చేసే అవకాశం ఉందా..? అనే సందేహాలు మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే గ్రూపు తగాదాల కారణంగానే ఆలస్యం జరుగుతోందని, లేదా ఎస్సీ రిజర్వేషన్ మారబోతుందని ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చైర్మన్ ఎంపికపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికకు సంబంధించి అధికారిక ప్రకటన ఎప్పుడు వెలువడుతుంది, ఎస్సీ రిజర్వేషన్ కొనసాగుతుందా, మార్పు ఉంటుందా అన్నది వేచి చూడాల్సిందే.

## కాళ్లపూర్ రైతుల పట్టా భూములను భూసేకరణ నుంచి మినహాయించాలి : ఎమ్మెల్యే డా.టి.రామ్మోహన్ రెడ్డి

- ఇండస్ట్రియల్ పార్క్ కోసం అసైన్‌మెంట్ భూములనే వినియోగించాలని అసెంబ్లీలో విజ్ఞప్తి
- పరిగికి ఆర్డీఓ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ కాంప్లెక్స్ మంజూరుపై మంత్రి సానుకూల స్పందన



**పరిగి, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** కాళ్లపూర్ గ్రామంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చేపడుతున్న భూసేకరణలో పేద రైతుల పట్టా భూములకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం కాళ్లపూర్ గ్రామానికి చెందిన సుమారు 160 ఎకరాల పట్టా భూములను భూసేకరణ నుంచి మినహాయించి, కేవలం అసైన్‌మెంట్ భూములను మాత్రమే వినియోగించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పట్టా భూములకు ప్రత్యామ్నాయంగా ఇతర గ్రామాల్లో అందుబాటులో ఉన్న అసైన్‌మెంట్ భూములను కేటాయించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే సంబంధిత అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, గ్రామస్తులతో చర్చించిన విషయాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. కాళ్లపూర్ రైతుల ప్రయోజనాలను కాపాడుతూ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూమిని ప్రత్యామ్నాయ మార్గంలో సమకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా పరిగి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ కాంప్లెక్స్‌తో పాటు ఆర్డీఓ కార్యాలయం మంజూరు చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేద రైతుల భూములకు రక్షణ కల్పించడంతో పాటు పరిగి ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల సాధన లక్ష్యంగా ఈ అంశాలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## నవాంద్గి సొసైటీ అభివృద్ధికి బ్యాంకు మేనేజర్ అడ్డంకులు

- రూ.80 లక్షల లాభాల్లో ఉన్నాం.. గోల్డ్ లోన్లు, ఎరువుల విక్రయాలకు ఆటంకాలు
- సమస్యలు పరిష్కరించకపోతే బ్యాంకు ఎదుట ధర్నా: చైర్మన్ వెంకట్రాంరెడ్డి

**బషీరాబాద్, సెప్టెంబర్ 16, ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని నవాంద్గి సొసైటీ కార్యాలయంలో బుధవారం సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ సుమారు రూ.80 లక్షల లాభాలతో అభివృద్ధి దిశగా కొనసాగుతోందని తెలిపారు. పాలకవర్గ సభ్యుల సహకారంతోనే సొసైటీ ఈ స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. యాలాల్ మండలం లక్ష్మీనారాయణపూర్ బ్యాంకు మేనేజర్ నుంచి సొసైటీ కార్యకలాపాలకు పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చైర్మన్ ఆరోపించారు. సొసైటీలో గోల్డ్ లోన్లు ఇవ్వకుండా, ఎరువుల విక్రయాలకు అనుమతులు లేకుండా చేయడం, సిబ్బందికి జీతాలు చెల్లించడంలో ఆటంకాలు కల్పించడం, పంట రుణాల విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గోల్డ్ లోన్లు నవాంద్గి సొసైటీలో కాకుండా లక్ష్మీనారాయణపూర్ బ్యాంకు ద్వారా పొందేలా పరిస్థితులు ఏర్పడుతున్నాయని చైర్మన్ ఆరోపించారు. దీని వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సొసైటీ కార్యకలాపాలకు సంబంధించిన సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు. సొసైటీ అభివృద్ధికి ఆటంకాలు కొనసాగితే పాలకవర్గం, మండల రైతులతో కలిసి లక్ష్మీనారాయణపూర్ బ్యాంకు ఎదుట ధర్నా నిర్వహిస్తామని వెంకట్రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటయ్య, సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డి, అశోక్ గౌతం, రంగారెడ్డి, గోపాల్, హనుమంత్ రెడ్డి, పాపమ్మ, సొసైటీ సిబ్బంది రాజశేఖర్, బందెప్ప, ఫారుక్, తుకారం, నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలందరికీ కడుపునిండా అన్నం పెట్టడమే కాంగ్రెస్ లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి
- లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డ్స్ పంపిణీ చేసిన
- సిద్ధాపూర్ సర్పంచ్ బాసు నాయక్

**కొత్తూరు సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి) :** ప్రతి నిరుపేదకు కడుపునిండా అన్నం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, సిద్దాపూర్ సర్పంచ్ బాసు నాయక్ అన్నారు. బుధవారం కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ లో సర్పంచ్ బాసు నాయక్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను దశలవారీగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఆరు గ్యారెంటీల పథకాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దొబ్బల యాదయ్య, పంచాయతీ సెక్రెటరీ మంద కుమార్, వార్డు సభ్యులు కొమరబండ స్రవంతి మైపాల్, వడ్డే నందు, ఎండి ఖయ్యూం ఖాన్, దొబ్బల అనిత, వెంకట్ నాయక్, కిషన్ నాయక్, గుండమోని నరసింహ, జిపిఓ రాజు, మాజీ ఎంపిటిసి రాశుల జంగయ్య, రేషన్ డీలర్ గుబ్బ మాణిక్యం, గుడి చైర్మన్ గుండమోని కుమార్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.






# అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవ అవగాహన కార్యక్రమం

తాడి బోయిన రామస్వామి

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 15 (ప్రజాజ్యోతి) :** అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఓజోన్ పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియే షన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.అనుపమ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య జి.కిషోర్ కుమార్, సెంటర్ ఫర్ ఎర్త్, అట్మా స్ఫియరిక్ సైన్సెస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివ ర్సిటీ, హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఆచార్య కిషోర్ కుమార్ మాట్లాడుతూ... సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాలను శోషించడంలో స్ట్రాటోస్ఫెరిక్ ఓజోన్ పొర కీలక పాత్ర పోషిస్తుందని, తద్వారా మానవులు, జంతువులు, మొక్కలు సహా భూమిపై ఉన్న జీవరాశులకు ఇది సహజ రక్షణ కవచంగా పనిచేస్తుందని తెలిపారు.

ఓజోన్ పొరలో ఏర్పడుతున్న మార్పులు, ముఖ్యంగా అంటార్కిటికా ప్రాంతంలో ఓజోన్ క్షీణతను శాస్త్రవేత్తలు గుర్తించిన నేపథ్యంలో ప్రపంచ దేశాలు ఓజోన్ పొరను రక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో చర్యలు చేపట్టాయని వివరించారు. క్లోరోఫ్లోరోకార్బన్లు, హాలాన్లు మరియు ఇతర ఓజోన్-క్షీణక రసాయనాల వినియోగాన్ని నియంత్రించేందుకు 1987లో మాంట్రియల్ ప్రోటోకాల్ కుదిరిందని చెప్పారు. ఐక్యరాజ్యసమితి 1994లో సెప్టెంబర్ 16ను అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవంగా ప్రకటించిందని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

శీతలమైన భూగ్రహం కోసం ప్రపంచవ్యాప్త కార్యాచరణ -- కిగాలి సవరణ కింద స్థిరమైన శీతలీకరణకు 10 ఏళ్ల ప్రస్థానం అనే ఈ సంవత్సరం సందేశం ద్వారా ఓజోన్ పరిరక్షణతో పాటు పర్యావరణహిత శీతలీకరణ సాంకేతికతల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఓజోన్ ప్రధానంగా వాతావరణంలోని స్ట్రాటోస్ఫియర్‌లో, భూమి ఉపరితలం నుంచి సుమారు 15--35 కిలోమీటర్ల ఎత్తులో అధిక సాంద్రతతో ఉంటుంది. ఈ ఓజోన్ పొర సూర్యుడి నుంచి వచ్చే హానికరమైన యు వి-బి కిరణాలలో గణనీయమైన భాగాన్ని గ్రహించి భూమిపై జీవరాశులను రక్షిస్తుంది. మరోవైపు, భూమికి సమీపంలోని ట్రోపోస్ఫియర్‌లో అధికంగా ఉండే ఓజోన్ ఒక వాయు కాలుష్యకారకంగా మారి మానవ ఆరోగ్యం, పంటలు పర్యావరణ వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు అనిత, సరిత ఉపాధ్యాయుడు శ్రీకాంత్, విద్యార్థినీ, విద్యార్థులు మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు అమ్మయ్య చౌదరి, బాలన్న తదితరులు పాల్గొన్నారు.





## గూడూరులో మున్నూరు అంజమ్మ దశదిన కార్యక్రమం

నివాళులర్పించిన మాజీ జెడ్పిటిసి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ



**కొత్తూరు సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** చేగురు పిఏసిఎస్ మాజీ చైర్మన్ మున్నూరు పద్మారావు మాతృమూర్తి మున్నూరు అంజమ్మ దశదిన కార్యక్రమం బుధవారం కొత్తూరు మండలంలోని గూడూరులోని సగృహంలో వారి కుటుంబ సభ్యులు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఓబుల్ రెడ్డి వడ్డే బాలయ్య, కడల శ్రీశైలం, గూడూరు శ్రీనివాస్, ఎమ్మె మల్లేష్, దండు తిరుపతయ్య, కుమ్మరిగూడెం పాండు, మన్నె లక్ష్మయ్య, జామకాయల కృష్ణయ్య, చిర్ర సంతోష మధుసూదన్ రావు, మల్లాపూర్ వార్డ్ సభ్యులు మాజీ ఎంపిటిసి దర్శన్, బుడుగు బీరప్ప, మీసాల రాజు (గూడూరు కారోబార్) తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఐకాన్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు లయన్ డా.ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి) :** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 2026 గ్లోబల్ ఐకాన్ టీచర్ అంతర్జాతీయ స్థాయి, డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా.ఇ.ఎస్.ఎస్.నారాయణ మాస్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 11న హైదరాబాద్‌లో పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులతో పాటు సాంస్కృతిక, క్రీడా, కళలు, యోగా రంగాల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యా అర్హతలు, బోధన అనుభవం, సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికా క్లిప్పింగ్స్, గతంలో అందుకున్న అవార్డుల వివరాల జిరాక్స్ కాపీలతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలను జత చేసి సెప్టెంబర్ 30లోపు ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమి, డోర్ నెం.1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి పోస్టు, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపించాలని కోరారు. ఇతర పూర్తి వివరాలకు ఫోన్ : 9652347297 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## గణేష్ ఉత్సవాలు సురక్షితంగా నిర్వహించాలి



**బోయిన్ పల్లి, సెప్టెంబర్ 16.(ప్రజా జ్యోతి) :** న్యూ బోయినపల్లిలో రాణా ప్రతాప్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో "సహచరి--గణేష్ సురక్ష సంకల్ప్--2026" కార్యక్రమం నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాన్ని సురక్షితంగా నిర్వహించడం అందరి బాధ్యత అన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, మహిళా భద్రత, ట్రాఫిక్, ఆహార భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 100 మందికి పైగా పాల్గొన్నారు. క్విజ్‌లో విజేతలకు మెడల్స్ అందజేశారు. అనంతరం అవగాహన పుస్తకాలను పంపిణీ చేశారు. సీఐ తిరుపతిరాజు, డీఐ కోటేశ్వరరావు, ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్ఐలు వేణుగోపాల్, శ్రీవర్ధన్, కిరణ్ కుమార్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్లు లేక తరచూ ప్రమాదాలు..

### పోతుగల్ రోడ్డులో రోడ్డు ప్రమాదం – ఒకరికి గాయాలు

ముస్తాబాద్, సెప్టెంబర్ 16 ( ప్రజా జ్యోతి): ముస్తాబాద్ మండలం పోతుగల్ రోడ్డులోని సోమశేఖర పిల్లల ఆసుపత్రి ఎదుట మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తుర్కపల్లె గ్రామానికి





చెందిన శ్యాగ జితేందర్ గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. మారుతి సుజుకి షోరూం నుంచి డబుల్ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు అవసరమైన డివైడర్లను ఏర్పాటు చేయక పోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. డివైడర్లు లేకపోవడంతో వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో జితేందర్ ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి స్కిడ్ అయి రోడ్డుపై పడటంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనలో జితేందర్‌కు గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

**డివైడర్లు లేక ప్రమాదాల ముప్పు:**

పోతుగల్ రోడ్డులోని ఈ ప్రాంతంలో డివైడర్లు లేకపోవడంతో తరచూ చిన్నా, పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆసుపత్రి సమీపంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో పాటు వాహనదారుల భద్రతకు అవసరమైన డివైడర్లు, సూచిక బోర్డులు, రోడ్డు మార్కింగ్ వంటి భద్రతా చర్యలను కూడా చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**అధికారులు వెంటనే స్పందించాలి:**

ఈ ప్రాంతంలో తరచూ జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుకు అనుగుణంగా డివైడర్లు ఏర్పాటు చేయడంతో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగే పరిస్థితులు మరింత తీవ్రం కాకముందే సమస్యను పరిష్కరించాలని, ముఖ్యంగా ఆసుపత్రి ముందు ప్రాంతంలో రహదారి భద్రతా చర్యలను పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## మట్టి గణేష్‌ను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

ముస్తాబాద్, సెప్టెంబర్ 16 (ప్రజా జ్యోతి): స్నేహశీల యూత్ ఆధ్వర్యంలో శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల 32వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. గత ఎనిమిదేళ్లుగా స్నేహశీల యూత్ సభ్యులు



పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని మట్టి గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మట్టి గణేష్ విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని యూత్ సభ్యులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ నిత్య పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నిర్వాహకులు తుమ్మ రాజేందర్, సందుల రాజు, గుండవెల్లి సతీష్, హనుమాన్లు, ముధం సతీష్, ప్రభాస్, ప్రశాంత్, వేణు, హర్ష, రితీష్, ప్రబోధి రెడ్డి తదితరులు పాల్గొంటున్నారు.

## ఆరోగ్యమే మహిళలకు అసలైన ఆస్తి!

### మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

### చిన్ననాటి నుంచే ఆరోగ్య అలవాట్లు

### ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 16:( ప్రజా జ్యోతి ) మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని నేషనల్ హెల్త్ మిషన్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ సుబ్రహ్మణ్యం ఎడ్యుకేష



నల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ హెల్త్ డిపార్ట్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి అనూష సూచించారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అనూష, టి. శిరీష మాట్లాడుతూ.. మహిళలు సమతుల్య ఆహారం తీసుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతిరోజూ పరిశుభ్రత పాటించడం, పోషకాహారం తీసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు.

**చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు**

విద్యార్థినులు చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, శారీరక వ్యాయామం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు.మహిళల ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ , వైస్ ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థినులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

### విద్యార్థుల ఆకలిని తరిమి.. అక్షరానికి అండగా నిలవడమే ధ్యేయం

### రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.

### రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 16( ప్రజాజ్యోతి ): పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు



రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.

**విద్యే.. పిల్లలకు గొప్ప ఆస్తి:**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.

**ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు:**

ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం:**

కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.

**అధునాతన యంత్రాలతో ఆహార తయారీ:**

కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే విధమైన నాణ్యతతో, పరిశుభ్రంగా అల్పాహారం అందించడమే కేంద్రీకృత వంటశాలల ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ISO స్థాయి ప్రమాణాలను పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు సకాలంలో అల్పాహారం తరలిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన, సాధారణంగా ఇళ్లలో తినే ఆహార పదార్థాలతో మెనూ రూపొందించామని, మెనూ




రూపకల్పనలో NIN సహకారం తీసుకున్నామని చెప్పారు.

**వారంలో ఆరు రకాల అల్పాహారం:**

సోమవారం ఇడ్లీ–సాంబార్, మంగళవారం పూరీ–ఆలూ కుర్మా, బుధవారం దోశ–చట్నీ, గురువారం ఉప్మా–చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ–సాంబార్, శనివారం బోండా–చట్నీ అందిస్తామని మంత్రి వివరించారు. రోజు విడిచి రోజు విద్యార్థులకు పాలు కూడా అందిస్తామని తెలిపారు.

**కోడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్..**

2024 డిసెంబర్‌లో కోడంగల్‌లో స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని మంత్రి తెలిపారు. అక్కడ విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు గుర్తించామని చెప్పారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలన మెరుగుపడినట్లు, ఆలస్యంగా పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. కోడంగల్‌లో అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

**రాష్ట్రవ్యాప్తంగా 17.72 లక్షల మంది విద్యార్థులకు..**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నామని చెప్పారు.

31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, వీటి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అల్పాహారం పంపిణీకి సుమారు 1,400 వాహనాలు, 5,000 మంది సిబ్బంది అవసరమవుతారని చెప్పారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15,000 ప్రత్యక్ష, 10,000 పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు.

**హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు ధన్యవాదాలు:**

స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం CSR నిధుల కింద సంస్థకు సహకరిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచినందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గతంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఇదే ఫౌండేషన్ ద్వారా కరీంనగర్‌లో ఆలయం నిర్మించాలని అనుకున్నామని, ఆ అంశం ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని చెప్పారు. మళ్లీ ఫౌండేషన్‌తో కలిసి ఆ దిశగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను కూడా హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విజిలెన్స్ విచారణ పూర్తయిందని, కళాశాలలకు రావాల్సిన బకాయిలను విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**విద్యార్థులతో కలిసి అల్పాహారం:**

సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం కిచెన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి వాటి పనితీరు, ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర

### ఆ భూముల్లో కాషాయ జెండాలు ఎగరేసి పేదలకు పంచుతాం

### కాంగ్రెస్–బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం : కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 16( ప్రజాజ్యోతి ): బీఆర్ఎస్ నేతలు అక్రమంగా ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో దండయాత్ర చేపడతామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. ఆ భూముల్లో కాషాయ జెండాలు ఎగరేసి



పేదలకు పంచిపెడతామని అన్నారు. బీఆర్ఎస్ భూముల వ్యవహారంపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యల వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు.బుధవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి మానకొండూరు, చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో బండి సంజయ్ పర్యటించారు. గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జన ఉత్సవాల కోసం రూ.1.5 కోట్ల నిధులు కేటాయించామని బండి సంజయ్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే మూడింతలు ఎక్కువ నిధులు కేటాయించినట్లు చెప్పారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, విద్యుత్ దీపాలంకరణ తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. నిమజ్జనానికి మూడు రోజుల ముందే నీటిని విడుదల చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని అన్నారు. కరీంనగర్‌ను కాషాయమయం చేస్తామని వ్యాఖ్యానించారు.అసెంబ్లీలో బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల భూవ్యవహారాలపై మాట్లాడేందుకే గంట సమయం పట్టిందని, 90 మంది ఎమ్మెల్యేల భూవ్యవహారాలపై మాట్లాడాలంటే ఇంకా ఎన్ని రోజులు అసెంబ్లీ నిర్వహించాలని బండి సంజయ్ ప్రశ్నించారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో ప్రజలకు సొంత భూములు, ఇల్లు లేని పరిస్థితి ఉందని, మరోవైపు బీఆర్ఎస్ నేతలు వేల ఎకరాల భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు.

తాను గతంలో బీఆర్ఎస్ భూవ్యవహారాలపై మాట్లాడినప్పుడు కేసీఆర్ తనపై తీవ్ర వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ తాను వెనక్కి తగ్గలేదని అన్నారు. బీఆర్ఎస్ నేతలు వేల ఎకరాల భూములు ఆక్రమించుకున్నారని చెప్పడానికి ఇంతకాలం ఎందుకు పట్టిందని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విద్యుత్ కొనుగోళ్లు, ఈ–ఫార్ములా రేసు, కాళేశ్వరం, గొర్రెల పథకం తదితర అంశాలపై ఏర్పాటు చేసిన విచారణలు, సిట్‌ల పరిస్థితి ఏమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. భూముల వ్యవహారంపై కూడా విచారణ పేరుతో కాలయాపన చేయకుండా జిల్లా కలెక్టర్లకు పూర్తి అధికారాలు ఇస్తే త్వరగా నివేదికలు తెప్పించవచ్చని అన్నారు.ఫారెస్ట్ భూముల ఆక్రమణలపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలు అటవీ భూముల్లో సాగు చేస్తే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెద్దఎత్తున భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు ఎందుకు ఉండటం లేదని ప్రశ్నించారు.బీఆర్ఎస్ భూముల వ్యవహారాన్ని అసెంబ్లీలో ప్రస్తావించడం వెనుక కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందని బండి సంజయ్ ఆరోపించారు. ఏఐసీసీకి చెల్లించాల్సిన నిధుల నేపథ్యంలో బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ బేరసారాలు చేస్తోందని, యూపీ ఎన్నికల కోసం అవసరమైన డబ్బులను బీఆర్ఎస్ సమకూర్చే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు.కేసీఆర్ ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూమి ఉందని తేల్చేందుకు 33 నెలలు ఎందుకు పట్టిందని ప్రశ్నించిన ఆయన, ప్రభుత్వ భూములు ఉన్నట్లయితే వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూములపై బీజేపీ త్వరలో దండయాత్ర చేపడుతుందని బండి సంజయ్ ప్రకటించారు. సంబంధిత భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచిపెట్టేందుకు పోరాటం చేస్తామని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రజల ప్రయోజనాల కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు.

## కరీంనగర్‌లో గల్లీగల్లీలో రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం

### డంపింగ్ యార్డుకు మరో వారం రోజుల్లో టెండర్లు

### యూసీఎఫ్ నుంచి మరో రూ.80 కోట్లు వెచ్చిస్తాం:

### కేంద్రమంత్రి బండి సంజయ్

కరీంనగర్ బ్యూరో,సెప్టెంబర్ 16 (ప్రజాజ్యోతి): కరీంనగర్ ప్రజలకు శుభవార్తగా డంపింగ్ యార్డు పనులకు మరో వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛ భారత్ పథకం కింద రూ.16 కోట్లతో చేపట్టనున్న డంపింగ్ యార్డు పనులను వేగవంతం చేస్తామని వెల్లడించారు. యూసీఎఫ్ (అర్బన్ ఛాలెంజ్ ఫండ్) కింద మంజూరైన




రూ.840 కోట్లలో మరో రూ.80 కోట్లను డంపింగ్ యార్డు పనులకు కేటాయించనున్నట్లు చెప్పారు.బుధవారం కరీంనగర్ నగరంలోని 13, 42, 49వ డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు బండి సంజయ్ మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి శ్రీకారం చుట్టారు. 42వ డివిజన్ భగత్‌నగర్‌లోని మమత థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం పొలాడి ఆనందరావు అపార్ట్‌మెంట్ గల్లీలో రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.49వ డివిజన్ భాగ్యనగర్‌లోని బాలాజీ సూపర్ మార్కెట్ సమీపంలో రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. పోచమ్మ కమాన్ సమీపంలో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, పైప్‌లైన్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక శ్రీ గాయత్రి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని దర్శించుకున్నారు.13వ డివిజన్ శివనగర్ బైపాస్ రోడ్ సమీపంలోని లారెల్ స్కూల్ వద్ద రూ.75 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ యూఐడీఎఫ్ పథకం కింద రూ.50 కోట్లతో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, గల్లీగల్లీలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు.

పనులు చేపట్టకుండా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రతిపాదనల మేరకు కేంద్రం నుంచి రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులు మంజూరయ్యాయని, త్వరలో వాటితో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

డంపింగ్ యార్డు పనులకు సంబంధించి వారం రోజుల్లో రూ.16 కోట్ల స్వచ్ఛ భారత్ నిధులతో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, యూసీఎఫ్ నుంచి మరో రూ.80 కోట్లు వెచ్చించి డంపింగ్ యార్డు పనులను చేపడతామని బండి సంజయ్ వెల్లడించారు.

## కొత్తగూడెం రీజియన్ ఈపీ ఆపరేటర్ల పదోన్నతులు వెంటనే చేపట్టాలి

◆ ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్



**సత్తుపల్లి సెప్టెంబర్16(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగూడెం రీజియన్ స్థాయిలో ఈపీ ఆపరేటర్లకు సంబంధించి ఏ గ్రేడ్ వేకెన్సీల పదోన్నతులు భర్తీ చేయాలని జీ.వెంకట కిరణ్ కుమార్ సింగరేణి జనరల్ మేనేజర్ పర్సనల్ (ఐ.ర్ అండ్ పి.ఎం) ను కలిసి వినతి పత్రం ఇచ్చిన ఐఎన్టియుసి ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్. కొత్తగూడెం రీజియన్ స్థాయిలో ఆపరేటర్లకు సంబంధించి సీ గ్రేడ్ బి గ్రేడ్ పదోన్నతులు కల్పించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా కొత్తగూడెం రీజియన్ స్థాయిలో మణుగూరు ,కొత్తగూడెం, ఇల్లెందు , సత్తుపల్లి ఓపెన్ కాస్ట్ గనులలో విధులు నిర్వహిస్తున్న ఈపి ఆపరేటర్లు సెప్టెంబర్ 2025 నాటికి మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న బి గ్రేడ్ ఆపరేటర్లకు ఏ గ్రేడ్ పదోన్నతులు కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. జనరల్ మేనేజర్ పర్సనల్ జి వెంకట కిరణ్ కుమార్ స్పందిస్తూ వీలైనంత త్వరగా ఈపి ఆపరేటర్లకు రావలసిన గ్రేడ్ టెస్ట్ నిర్వహించి ప్రమోషన్ ఇచ్చుటకు కృషి చేస్తామని తెలిపారు అని తెలియజేశారు.

### ఈవిఎం గోడౌన్‌ను
## తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు.ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు.సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ,నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని,సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు.జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ,ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్,బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి వేల్పుల రామయ్య, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్,అధికారులు,తదితరులు ఉన్నారు.

### యూపిఐ పై చార్జీల
## దోపిడీ పేదోడి జేబు కొట్టే కుట్ర



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఫైర్‌సామాన్యుడు డిజిటల్ పేమెంట్ చేస్తే కూడా చార్జీల పేరుతో దోచుకోవాలని చూస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరు దారుణమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ధ్వజమెత్తారు.కొత్తగా యూపిఐ పేమెంట్లపై చార్జీలు వసూలు చేయాలని కేంద్రం యోచిస్తుండటంపై ఆయన తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోట్ల రద్దుతో మొదలుపెట్టి డిజిటల్ ఇండియా అని గొప్పలు చెప్పి, ఇప్పుడు అదే డిజిటల్ లావాదేవీలపై చార్జీల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల రక్తం తాగాలని చూస్తోంది బీజేపీ. టీ కొట్టు, కూరగాయల బండి దగ్గర కూడా 10 రూపాయలు యూపిఐ చేస్తే చార్జీ కట్టాలా ఇది దోపిడీ కాదా అదే విధంగా నాడు నల్లధనం తీసుకొచ్చి పేద ప్రజల అకౌంట్ లో వేస్తామని మోసంచేసింది నిజం కాదా కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు మాఫీ చేసే మోదీ ప్రభుత్వం, సామాన్యుడి చెమట డబ్బుపై కన్నేసింది. బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్ లేదని దోపిడీ, ఇప్పుడు యూపిఐ చేస్తే దోపిడీ. ఇది ప్రజా ప్రభుత్వమా దోపిడీ ప్రభుత్వమా తక్షణమే యూపిఐ చార్జీల ప్రతిపాదనను వెనక్కి తీసుకోకపోతే, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరిచి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. బీజేపీ దోపిడీ విధానాలను ప్రజల్లో ఎండగడతాం" అని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- అనామిలిస్, మ్యామింగ్ ఓటర్ల జాబితా వేగవంతం చేయాలి
- కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి త్వరితగతిన జారీ చేయాలి
- బిఎల్ఓలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలి
- ఖమ్మం నగరంలో పాత డిఆర్డీవో కార్యాలయం ఆవరణ జరుగుతున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం మ్యాపింగ్ కానీ,అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసుల జారీ, డాక్యుమెంట్స్ అప్లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక బస్ డిపో రోడ్, పాత డిఆర్డీఏ కార్యాలయ పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న విధులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు.ప్రత్యక్షంగా హియరింగ్‌కు హాజరైన ఓటర్ల తో ఎదురైన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయి బిఎల్వోలకు అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించాలని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియపై బిఎల్వోలు సరైన ప్రణాళికతో విధులు నిర్వహించాలని,నోటీసులు అందుకున్న వారిలో ఏ,బి,సి కేటగిరీల వారీగా సంబంధిత ఓటర్లతో అవసరమైన డాక్యుమెంట్లను మాత్రమే తీసుకోవాలని, కుల ధృవీకరణ పత్రాలు అవసరమైన వారికి మంజూరు చేసేలా ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా తప్పులు లేని, పారదర్శకమైన సమగ్ర ఓటరు జాబితాను రూపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు.మ్యాపింగ్ కాని,అనామిలిస్ జాబితాలో ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాక, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. అవసరమైన వారికి కులధృవీకరణ పత్రాలు తీసుకువచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు.నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ తనిఖీల సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, బిఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# చలో ఐటీడీఏను జయప్రదం చేయండి

◆ తుడుందెబ్బ నాయకుల పిలుపు



**చర్ల, సెప్టెంబర్ 16 :(ప్రజా జ్యోతి):** సెప్టెంబర్ 21న భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిర్వహించనున్న చలో ఐటీడీఏ ఆదివాసీ మార్చ్‌ను జయప్రదం చేయాలని తుడుందెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం చర్లలోని తుడుందెబ్బ కార్యాలయ ఆవరణలో ఆదివాసీ ఉద్యమ వీరుడు కొమురం భీమ్ విగ్రహం ఎదుట చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం చేతుల మీదుగా మార్చ్‌కు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు వాసం ముసలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆదివాసీల జీవన పరిస్థితులు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఐటీడీఏలను నిర్వీర్యం చేస్తూ ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగాలను మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారని విమర్శించారు. తాజా పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కూడా ఆదివాసీ నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.జీవో 109 ప్రకారం ఆదివాసీలకు దక్కాల్సిన వాటాను అందించాలని డిమాండ్ చేశారు. 1960 వడ్డీ వ్యాపార నిషేధ చట్టం అమలులో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ ఆదివాసీలను ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సెప్టెంబర్ 21న నిర్వహించే ఐటీడీఏ మార్చ్‌కు ఆదివాసీ ప్రజలు, యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వాల్లే శ్రీకాంత్, సీనియర్ నాయకులు పూనెం వరప్రసాద్, మండల అధ్యక్షుడు తాటి రామకృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం రవికిరణ్, కోశాధికారి కలం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సోడి రవీంద్ర, సహాయ కార్యదర్శి తుర్రం ఆదినారాయణ, ఆర్గనైజేషన్ సెక్రటరీ తాటి శ్రీను, మడప అనిల్ కుమార్, సోడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నాయి బ్రాహ్మణ దినోత్సవం





**చర్ల, సెప్టెంబర్ 16 :(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం 500/82 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కులదైవం ధన్వంతరి స్వామికి పూజలు నిర్వహించి, నాయి బ్రాహ్మణ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తోటపల్లి రమణ మాట్లాడుతూ తరతరాలుగా కొనసాగుతున్న నాయి బ్రాహ్మణుల కులవృత్తి పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. సెలూన్ల ఏర్పాటుకు సబ్సిడీ, తక్కువ వడ్డీ రుణాలు, యువతకు ఆధునిక వృత్తి శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వృత్తిపై ఆధారపడిన కుటుంబాలకు ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా 60 ఏళ్లు దాటిన నాయి బ్రాహ్మణ వృద్ధులను సన్మానించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ గౌరవ సలహాదారు తోటపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కోండ్రు హరీష్, ప్రచార కార్యదర్శి గోరంట్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సుంకర రాజేష్, కోశాధికారులు అయినవిల్లి శ్రీను, నేదునూరి చక్రవర్తి, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కుదునూరు ధర్నాని విజయవంతం చేయండి

◆ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ ఐనవోలు పవన్ పిలుపు



**చర్ల, సెప్టెంబర్ 16 :(ప్రజా జ్యోతి):** భద్రాచలం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న శుక్రవారం ఉదయం 10 గంటలకు చర్ల మండలం కుదునూరు గ్రామంలో ప్రధాన రహదారి దిగ్బంధం, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో-కన్వీనర్ ఐనవోలు పవన్ తెలిపారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానెం రామకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు దెబ్బతిన్న రహదారులను నూతనంగా నిర్మించాలని, ఇసుక లారీల రాకపోకలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే తాలిపేరు కుడి, ఎడమ కాలువలను తక్షణమే బాగుచేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని, తాలిపేరు నీరు వృథాగా పోకుండా చెరువులను నింపాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న దిగ్బంధం, ధర్నా కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి కనీసం 10 మంది నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై విజయవంతం చేయాలని దొడ్డి తాతారావు, ఐనవోలు పవన్ పిలుపునిచ్చారు.

# టేక్ హోమ్ రేషన్ పై అవగాహన కార్యక్రమం



**చర్ల, సెప్టెంబర్ 16:(ప్రజా జ్యోతి):** పోషణ మాసం--2026లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు చర్ల పరిధిలోని ఆర్.కొత్తగూడెం సెక్టార్‌లో బుధవారం టేక్ హోమ్ రేషన్, వంటకాల తయారీ, వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, తల్లులకు ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల పిల్లల సంరక్షకులకు టేక్ హోమ్ రేషన్‌లోని పోషక విలువలు, వివిధ వంటకాల తయారీ విధానాలు, సరైన వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు పాఠశాల పోషకాహార పథకం మెనూ బోర్డుల ద్వారా వివిధ టేక్ హోమ్ రేషన్ వంటకాలను ప్రదర్శించి, వాటి తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. టేక్ హోమ్ రేషన్‌ను వృథా చేయకుండా పిల్లలకు రుచికరంగా, పోషకవంతంగా అందించే విధానాలను తల్లులకు తెలియజేశారు.టేక్ హోమ్ రేషన్ ద్వారా తల్లులు, పిల్లల్లో రక్తహీనతను నివారించడంతో పాటు సరైన పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించవచ్చని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ తుర్రం రవి , వార్డు సభ్యులు, సెక్టార్ సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, టేక్ హోమ్ రేషన్ లబ్ధిదారులు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



### ఈపీ ఆపరేటర్ పదోన్నతి
## పరీక్ష వెంటనే నిర్వహించాలి

◆ కార్పొరేట్ జీఎం పర్సనల్‌ను కలిసిన ఐఎన్‌టియూసి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు



**సత్తుపల్లి సెప్టెంబర్16(ప్రజా జ్యోతి)** ఈపీ ఆపరేటర్‌లకు బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్‌కు పదోన్నతి కల్పించేందుకు నిర్వహించాల్సిన పరీక్షను వెంటనే నిర్వహించాలని, సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు కోరారు.సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ డా. జనక్ ప్రసాద్ సూచన మేరకు, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ ఆధ్వర్యంలో కార్పొరేట్ జీఎం పర్సనల్ (ఐ ఆర్ డపి ఏం) జి. వెంకట కిరణ్ కుమార్ ని కలిసి కార్మికుల సమస్యలను వివరించారు.ముఖ్యంగా ఈపీ ఆపరేటర్‌లకు 2025 అక్టోబర్ నుంచి 2026 మార్చి మధ్య రావాల్సిన బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్ పదోన్నతి పరీక్షను వెంటనే నిర్వహించాలని కోరారు. అలాగే ఫిబ్రవరి 1వ తేదీన చేసిన ప్లే డే మస్టర్‌ను వెంటనే యాడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.కిష్టారం ఓసీ, జేవీఆర్ సీహెచ్‌పీలో పనిచేస్తున్న దాదాపు 45 మంది కార్మికులకు విధించిన హెచ్‌ఆర్‌ఏ రికవరీని వెంటనే నిలిపివేయాలని కోరారు. పీవీఎన్‌ఆర్ కాలనీలో స్విమ్మింగ్ పూల్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలపై కార్పొరేట్ జీఎం పర్సనల్( ఐ ఆర్ డపి ఏం ) జి.వెంకట కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరం, సెంట్రల్, కార్పొరేట్ బ్రాంచ్ నాయకులు అభిషేక్, జేవీఆర్ ఓసీ ఫిట్ సెక్రటరీ సీతారామరాజు, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.


### స్కూల్ పిల్లలకు స్పోర్ట్స్ డ్రెస్సులు,
## యూనిఫాం, కుర్చీలు, టేబులు వితరణ



**కారేపల్లి, సెప్టెంబర్ 16, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని పోలంపల్లి గేట్ తండా యుపిఎస్ స్కూల్ విద్యార్థులకు బుధవారం స్కూల్ యూనిఫామ్, స్పోర్ట్స్ డ్రెస్సులు, టేబులు, కుర్చీలు పోలంపల్లి మాజీ సర్పంచ్ భద్రునాయక్, జరపల రాజ్ కుమార్, చంద్రు ఫౌండేషన్ అధ్యక్షులు వీరన్న నాయక్ స్కూల్ కు ప్రభుత్వం నుంచి అందించే యూనిఫామ్ ఫుష్ లను సింగరేణి మండల ఎంఈఓ డీ. జయరాజు, పోలంపల్లి సర్పంచ్ దారావత్ హేమలతబాలాజీ, ఉప సర్పంచ్ గుగులోతు సర్వన్ లు స్కూల్ హెడ్మాస్టర్ విద్యార్థులకు అందజేసినారు. పోలంపల్లి స్కూల్లో మోకాళ్ళ గుంపు స్కూల్ నందు స్కూల్ యూనిఫామ్ లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్లు రాములు, వీరన్న, దస్రు, వీరు, వార్డ్ నెంబర్లు రమేష్, లావణ్య,సుజాత, మాజీ సర్పంచ్ సక్కు, గ్రామ పెద్దలు గుగులోతు జగ్గయ్య, తేజ నాయక్, చందర్,రాందాస్, లక్ష్మణ్, వినాయక్, పండు, హరి, రమేష్, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలి

- సమితిసింగారంలో సర్ పరిశీలన
- భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి./ మణుగూరు సెప్టెంబర్ 16, ప్రతినిధి** సర్ ప్రక్రియను సకాలంలోనే పూర్తి చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ అధికారులకు అదేశించారు. బుధవారం సమితిసింగారం గ్రామ పంచాయతీలో జరుగుతున్న సర్ ప్రక్రియను ఐటీడీఏ పీఓ పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ పనులు ఎంతవరకు జరిగాయో అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి చేస్తున్న సర్వే వివరాలను పరిశీలించారు. సర్ ప్రక్రియకు ఎటువంటి పొరపాట్లు లేకుండా, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను నొక్కి చెప్పారు. ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, ఎలక్షన్ డీటీ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడిని దర్శించిన ఎమ్మెల్యే వెంకట్రావు



**చర్ల, సెప్టెంబర్ 16:(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపంలో అర్చకులు విశ్వనాథ శర్మ ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు.అంతకుముందు గణేష్ నగర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు ఆత్మీయ స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, చీమలమర్రి మురళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు, కొసరాజు రాజా, పోలిన లంకరాజు, ముమ్మనేని అరవింద్, పొట్రు బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పీఎఫ్ వేతన గరిష్ఠ పరిమితి 25,000

**మొదటిపేజీ తరువాయి..**

అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వివరంగా వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా సుమారు 51 లక్షల మంది ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుందని ఆయన తెలిపారు. ఈ సామాజిక భద్రతా పథకం విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తరపున రూ. 11,339 కోట్ల నిధులను ఖర్చు చేయబోతోంది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17 నుంచే అమలులోకి రానుంది. గతంలో 2004 నుంచి 2014 వరకు పీఎఫ్ వేతన పరిమితి ఎలాంటి మార్పూ లేకుండా కొనసాగింది. అనంతరం సెప్టెంబర్ 2014లో దీనిని రూ. 15,000కు పెంచారు. దాదాపు దశాబ్ద కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు రూ. 25,000కు పెంచడం విశేషం. అనేక రాష్ట్రాల్లో కనీస వేతనాలు ఇప్పటికే రూ. 15,000 కంటే దాటిపోయిన నేపథ్యంలో 2014 పరిమితి కాలం చెల్లినదైందని, అందుకే సమగ్ర సంప్రదింపుల తర్వాత ఈ సీలింగ్‌ను రూ. 25 వేలకు పెంచినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రూ. 15,000 కంటే ఎక్కువ జీతంతో కొత్తగా ఉద్యోగంలో చేరే చాలామందికి పీఎఫ్, పెన్షన్, సంబంధిత బీమా రక్షణ లభించేది కాదు. తాజాగా వేతన సీలింగ్‌ను రూ. 25,000కి పెంచడం వల్ల రూ. 15,000 నుంచి రూ. 25,000 మధ్య సంపాదించే మధ్యతరగతి ఉద్యోగులందరూ ఇకపై చట్టబద్ధంగా ఈపీఎఫ్ పరిధిలోకి వస్తారు. ఇది ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లను పెంచడమే కాకుండా, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు తమ సిబ్బందికి మెరుగైన సామాజిక భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.

## దానం అనర్హతపై విచారణ వాయిదా

**మొదటిపేజీ తరువాయి..**

. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం పై హైకోర్టు శుక్రవారం తీర్పు వెల్లడి చేయనుంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను స్పీకర్ కొట్టివేసారు దీంతో.. ఇదే అంశం పైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేసింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్.. ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్‌లో చేరారని, పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు, కే వివేక్‌రెడ్డి ఇప్పటికే హైకోర్టుకు తెలిపారు. ముఖ్యంగా దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ బీ-ఫారంతో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీచేయడం ఈ కేసులో అత్యంత కీలక ఆధారమని తమ వాదనల్లో స్పష్టం చేసారు. అదే విధంగా పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాల న్న స్పీకర్ వైఖరిని పిటిషనర్లు వ్యతిరేకించారు. మరో పార్టీ తరఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులుకు న్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమిత మైనవి కావని వాదించారు. పిటిషనర్ల వాదనలతో దానం నాగేందర్ న్యాయవాది వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎకడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్టు భావించరాదని వాదించారు. వాదనలు విన్న తరువాత ధర్మాసనం ఈ రోజు వెల్లడించాల్సి ఉండగా.. శుక్రవారానికి వాయిదా వేస్తూ న్యాయ స్థానం నిర్ణయం తీసుకుంది.

## 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

**మొదటిపేజీ తరువాయి..**

పోయింది?" అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

## ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మరో గుడ్ న్యూస్

గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం
హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ విపి గౌతమ్ వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 16(ప్రజాజ్యోతి): తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలోఅల్పదాయ వర్గాల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ సొంతింటి పథకానికి సంబంధించి 20-07-2026 తేదీన జారీ చేసిన డిమాండ్ నోటిఫికేషన్ ద్వారా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం కల్పించినట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ మరియు హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్, ఐఏఎస్ తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాల్లో ఏదైనా ఒక నియోజకవర్గం కింద దరఖాస్తు చేసుకొని, ప్రస్తుతం కింది నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నివసిస్తున్న అభ్యర్థులు తమ పాత దరఖాస్తును ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గానికి బదిలీ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు 1. ఎల్‌బీ నగర్, 2. గోషామహల్, 3. ముషీరాబాద్, 4. చాంద్రాయణగుట్ట అర్హులైన అభ్యర్థులు తమ పాత దరఖాస్తు వివరాలతో తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోని కింది లింక్ ద్వారా 20-09-2026లోగా దరఖాస్తు బదిలీ కోసం అభ్యర్థించాలని శ్రీ వి.పి. గౌతమ్ సూచించారు. అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తు బదిలీ చేయబడుతుందని, ఈ బదిలీ నివాస ధ్రువీకరణతో పాటు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన అన్ని అర్హతలు, నిబంధనల పరిశీలనకు లోబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం అభ్యర్థులు కొత్తగా లేదా ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించరాదన్నారు. దరఖాస్తు బదిలీ చేయడం వల్ల ఇంటి కేటాయింపుపై ఎలాంటి హక్కు ఏర్పడదని, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ మరియు నిర్దేశించిన కేటాయింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి నగదు చెల్లించవద్దని శ్రీ వి.పి. గౌతమ్ కోరారు. అధికారిక సమాచారం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధీకృత మార్గాల ద్వారా మాత్రమే తెలియజేయబడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 040-24603572ను సంప్రదించవచ్చు.

# ప్రభుత్వం బేషరతుగా ఆది వాసి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

**లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి**

**ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ వేయాలి**

**ఆరు నెలలే శాంతియుత పోరాటం**

**ఆ తర్వాత రణరంగమే**

**తుడుం దెబ్బ రాష్ట అధ్య క్షుడు మైపతి అరుణ్ కుమా ర్**

**ఉట్నూర్ ఐటిడిఏను ముట్ట డించిన ఆదివాసీ గిరిజను లు**





ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 16,(ప్రజా జ్యోతి): ఆదివాసి గిరిజనులు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించే వరకు శాంతి యుత పోరాటం చేస్తామని, ఈ పోరాటం కూడా కేవలం ఆరు నెలలు మాత్రమేనని, అయినా ప్రభుత్వంలో స్పం దన కనిపిం చినట్లయితే ర ణరంగంగా మారుస్తామని అయినప్ప టికీ ప్రభుత్వం స్పందించకపోతే గోండ్వానా ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్య మిస్తామని ఆదివాసి హక్కు ల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా క్టర్ మైపతి అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. తుడుం దె బ్బ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యా ప్తంగా చేపడుతున్న ఐటిడి ఏ ల ముట్టడి కార్యక్రమం లో బాగంగా బుధవారం ఆ దివాసి గిరిజనులు ఉట్నూర్ ఐటిడిఏ కార్యాలయాన్ని ముట్టడించి కార్యాలయం ఎ దుట బైఠాయించి ధర్నా ని ర్వహించారు. దీనికి ముం దుగా ఉట్నూరు లో బారీ ర్యాలీ నిర్వహించారు.కేబి కాంప్లెక్స్ నుండి ప్రారంభ మైన ఈ ర్యాలీ అంబేద్కర్ చౌక్ మీదుగా ఐటీడీఏ కా ర్యాలయం వరకు సాగింది. అంబేద్కర్ చౌక్ లో అంబే ద్కర్ విగ్రహాని కి పూలమా లలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చే శారు. ఈ ర్యాలీ అనంతరం ఐటీడీఏ పిఓ కార్యాలయం ముందర ఆదివాసి గిరిజను లను ఉద్దేశించి రాష్ట్ర అధ్య క్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆది వాసి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని తాము గత కొంత కాలంగా ఉద్య మాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, అం దువల్లనే రాష్ట్రంలోని ఐ టి డిఏ ల ముట్టడి కార్యక్రమా లు చేపట్టడం జరిగిందని పే ర్కొన్నారు. కేవలం ఆరు నె లలు మాత్రమే ఈ శాంతి యుత పోరాటం చేస్తామని అయినా ప్రభుత్వం పట్టిం చుకోకపోతే తర్వాత ఉద్య మాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అందుకు ఆదివా సి గిరిజనులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం కనిపించకపోతే ప్ర త్యేక గోండ్వానా రాష్ట్రం కో సం ఉద్యమిస్తామని పేర్కొ న్నారు. 1976లో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో లం బాడీలను ఎస్టీ జాబితాలో కలిపిందని, ఇప్పుడు కూడా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభు త్వం ఉన్న దృష్ట్యా లంబాడీ లను ఎస్టీ జాబితా నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ మే తొల గించే బాధ్యత ను తీసు కో వాలని డిమాండ్ చేశారు. గత పది ఏళ్ళు పరిపాలించి న బిఆర్ఎస్ ప్రభుత్వం ఆది వాసి గిరిజనుల సమస్యలు ఏమాత్రం పట్టించుకోలేదని, ఇప్పుడు అధికారంలోకి వ చ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఆదివాసి గిరిజనుల సమస్యలు పట్టించుకో వడం లేదని ఆరోపించారు. తా ము రాజ్యాంగంలో పొందు పరిచిన హక్కులను, చట్టా లను మాత్రమే అమలు చే యుమంటున్నామని అన్నా రు. రాజ్యాంగం లోని 5, 6 షెడ్యూల్ ల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసి గిరి జనులకు ప్రత్యేక హక్కులు, చట్టాలు కల్పించినప్పటికీ ప్రభుత్వాలు వాటిని పక్కన పెడుతు న్నాయని, కొత్తగా ప్రత్యేక జీవోలు తీసుకువ స్తూ ఆదివాసి గిరిజనుల జీ వితాలను విచ్ఛిన్నం చేస్తు న్నాయని ఆరోపించారు. కొ మరం భీమ్ పోరాటం ఫలి తంగా అప్పట్లో అదివాసి గిరిజనుల సమస్యల పరి ష్కారం కోసం ప్రభుత్వం హై మాండార్ఫ్ కమిషన్ ను వే సిందని, హైమాండార్ఫ్ కమి షన్ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆది వాసి గిరిజనులకు ఏజె న్సీ ప్రాంతాలలో ప్రత్యేక హ క్కులు, చట్టాలు కల్పించి న ప్పటికీ పాలకులు వాటిని అమలు పరచలేకపోతు న్నాయని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రము ఏర్ప డితే ఆదివాసి గిరిజనుల సమస్యలు పరిష్కారమవు తాయని ఉద్యమంలో పా ల్గొంటే తెలంగాణ రాష్ట్రం వ చ్చిన తర్వాత కూడా మ రింత దోపిడి జరుగుతోంద ని, తెలంగాణలో ఉన్న ఆది వాసి గిరిజనుల ఆస్తులను కొల్లగొడుతున్నారని, జల్, జంగల్, జమీన్ కోసం చేప ట్టిన కొమరం భీమ్ ఉద్యమ ఫలితంగా ప్రత్యేక జీవోలు వెలువడినప్పటికీ ఆ జీవో లన్నింటినీ తుంగలో తొక్కు తున్నారని ఆరోపించారు. గోదావరి పరివాహక ప్రాం తం అనేక ప్రాజెక్టులు నిర్మిం చారని, దాదాపు 82 లక్షల ఎకరాల కు సాగునీరు అం దించే విధంగా ఈ ప్రాజెక్టు లు నిర్మించారని, ఆ ప్రాజెక్టు ల ఎగువ, దిగువ ప్రాంతా లలో ఆదివాసి గిరిజనుల వ్యవసాయ భూములు ఉ న్నప్పటికీ వాటికి సాగునీరు అందడం లేదు కానీ కెసి ఆర్, రేవంత్ రెడ్డి ఇతర మంత్రులు నివసించే ప్రాం తాల వ్యవసాయ భూము లకు మాత్రం ఈ నీరును త రలించుకుపోతున్నారని అ న్నారు. తెలంగాణలో 6వేల మెగావాట్ల విద్యుత్ ఉత్ప త్తి, పెద్ద ఎత్తున ఇసుక ఈ ప్రాంతం నుంచి మైదాన ప్రాంత పెత్తందారులకు వె ళ్తుందని ఆరోపించారు. గత పదేళ్ల కెసిఆర్ పాలన లో ఆదివాసి గిరిజనులు పూర్తి గా నష్టపోయారని, గత మూడేళ్ళ రేవంత్ సర్కార్ లో కూడా ఆదివాసి గిరిజ నులకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. రా జ్యాంగం కల్పించిన ఐదవ షెడ్యూల్ ప్రకారం షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసి గిరిజ నులకు న్యాయం జరగడం కోసం 29 శాఖలకు 29 ప్ర త్యేక జీవోలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆర్టి కల్ 342 ప్రకారం ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త జీవో లు ఏజెన్సీ ప్రాంతాలలో ఏ మాత్రం పనిచేయవని ఆయ న పేర్కొన్నారు. తక్షణమే ఆదివాసి గిరిజనుల సమ స్యలు పరిష్కరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెర వే ర్చాలని, వలస లంబాడీల సమస్యను తీర్చాలని ఆ యన డిమాండ్ చేశారు. ఆ దివాసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకోవద్దని ఆయన హితువు పలికారు. జాతీయ అధ్యక్షులు కొట్నా క్ విజయ్ కుమార్ మాట్లా డుతూ ఆదివాసి గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం తాము చేస్తున్న పోరాటం ఇక ఆగదని, తమ డిమాం డ్లు పరిష్కరించే వరకు పో రాటం కొనసాగు తుందని స్పష్టం చేశారు. ఈ ఆరు నెలలు మాత్రమే శాంతియు త పోరాటం చేస్తామని త ర్వాత ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఆయ న హెచ్చరించారు. ప్రభు త్వం ఆలోపు తమ డిమాం డ్లను ప్రత్యేక కమిషన్ ద్వా రా పరిష్కరించాలని డి మాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పుర్కబా పూరావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసి ఫాబాద్ కొమరం భీమ్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల తుడుం దెబ్బ అధ్య క్షులు మాట్లాడారు. అనంత రం ఐటిడిఏ ఇన్చార్జి ప్రాజెక్ట్ అధికారి రాజేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించా రు. ఈ సందర్భంగా ఆదివా సీలకు గల హక్కులకు సం బంధించిన ప్రత్యేక జీవో కా పీలను కూడా అందజేశారు.

## యూపీఐ లావాదేవీలు కస్టమర్లకు ఉచితమే..

**మొదటిపేజీ తరువాయి..**

నుంచి వ్యక్తికి చేసే చెల్లింపులతో పాటు వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే చెల్లింపులు కూడా వినియోగదారులకు ఉచితంగానే ఉంటాయని చెప్పారు. ఎండీఆర్ చెల్లించే వ్యాపారులు ఆ మొత్తాన్ని కస్టమర్లపై వేయడానికి అనుమతి ఉండదన్నారు. వార్షిక టర్నోవర్ రూ.లక్ష కంటే తక్కువగా ఉన్న చిన్న వ్యాపారులు ఎండీఆర్ పరిధిలోకి రారని నిగమ్ తెలిపారు. పెద్ద దుకాణాల్లో జరిగే లావాదేవీల్లో 96 శాతం రూ.2 వేల కంటే తక్కువ మొత్తానివేనని చెప్పారు. వీటిపై ఎలాంటి ఛార్జీ ఉండదన్నారు. రూ.2 వేలకుపైగా జరిగే లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లిస్తారని వివరించారు. ఈ ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయాన్ని యూపీఐ వ్యవస్థలో పెట్టుబడులకు ఉపయోగించవచ్చని నిగమ్ తెలిపారు. యూపీఐ మౌలిక సదుపాయాలను కొనసాగించేందుకే పరిశ్రమకు ఏటా కనీసం రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఖర్చవుతోందన్నారు. కేవైసీ, సైబర్ భద్రత, మోసాల నివారణ, చార్జ్‌బ్యాక్‌లు, మూలధన వ్యయం వంటి వాటికీ భారీగా ఖర్చవుతుందని చెప్పారు. యూపీఐ కొత్త ఆదాయ విధానం వల్ల ఫిన్‌టెక్ సంస్థలు మార్కెటింగ్, ఆవిష్కరణలు, పరిశోధన, అభివృద్ధిపై మరింత పెట్టుబడి పెట్టే అవకాశం ఉంటుందని నిగమ్ పేర్కొన్నారు. 2020 నాటికి యూపీఐ వినియోగదారులు దాదాపు 20 కోట్ల మంది ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 50-55 కోట్లకు చేరిందని తెలిపారు.

## ఓటుకు నోటు కేసులో దర్యాప్తు వేగవంతం

**మొదటిపేజీ తరువాయి..**




ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం (జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనా) విచారణ జరిపింది. తమపై నమోదైన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు చట్టపరంగా చెల్లదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారం ముమ్మాటికీ ప్రజాప్రాతినిధ్య/ఎన్నికల నిబంధనలకు సంబంధించిందని, దీనిపై దర్యాప్తు చేసే అధికారిక పరిధి ఏసీబీకి లేదని స్పష్టం చేశారు. 2015లో కేసు నమోదైన నాటికి అమల్లో ఉన్న చట్టాలను ప్రస్తావిస్తూ... నాటి నిబంధనల ప్రకారం లంచం ఇవ్వడం/తీసుకోవడం అనే ప్రక్రియను ఎన్నికల కేసుగా చూడాలి తప్ప, అవినీతి నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించలేమని న్యాయవాదులు వాదించారు. గతంలో ఈ కేసును సమగ్రంగా విచారించిన ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడంతో, ప్రస్తుత నూతన త్రిసభ్య ధర్మాసనం విచారణను మొదటి నుంచి చేపట్టింది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలను విన్న ధర్మాసనం, తదుపరి తుది విచారణ తేదీని త్వరలోనే సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ద్వారా ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది.

# ఇజ్రాయెల్‌కు అమెరికా భారీ ఆయుధ ప్యాకేజీ

**మొదటిపేజీ తరువాయి..**

20 వేలు ×-2000 పెనెట్రేటర్ వార్‌హెడ్‌లు ఉ ండనున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో ఇజ్రాయెల్‌కు అమెరికా ఇంత భారీ మొత్తంలో ఆయుధాలను ఒకేసారి విక్రయించడం ఇదే అయి ఉంటుందని తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధికారులకు ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా తన కథనంలో పేర్కొంది.ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్ కోసం 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీని సిద్ధం చేస్తోంది. దీనికి యూఎస్ ఫారిన్ మిలిటరీ ఫైనాన్సింగ్ ప్రోగ్రామ్ ద్వారా నిధులు సమకూర్చనున్నారు. ఈ కార్యక్రమం కింద అమెరికన్ ఆయుధాలను కొనుగోలు చేయడానికి ఇజ్రాయెల్‌కు నిధులను వాషింగ్టన్ అందిస్తుంది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గత జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వాల హయాంలో ఇచ్చిన ప్యాకేజీని దాటేసింది. ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ గురించి అమెరికా కాంగ్రెస్‌లోని సంబంధిత కమిటీలకు అనధికారికంగా సమాచారం అందింది. యూఎస్ సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ, అమెరికా హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీని ట్రంప్ ప్రభుత్వం సంప్రదించిందని అమెరికా మీడియా తన కథనంలో పేర్కొంది. 2.8 బిలియన్ డాలర్ల ఆయుధ ప్యాకేజీకి ఆమోదం తెలపాలని ఆ కమిటీలను కోరుతోందని స్పష్టం చేసింది. చరిత్రాత్మకంగా ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకాలకు ఉభయపక్షాలు మద్దతు ఇచ్చాయని వెల్లడించింది. అయితే గాజా, ఇరాన్‌లోని సంఘర్షణల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ మద్దతు ఇవ్వడంపై కొంతమంది చట్టసభ సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేశారని చెప్పింది. ఇజ్రాయెల్‌కు అమెరికా సైనిక సాయంపై వాషింగ్టన్‌లో చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ఆయుధ ప్యాకేజీ సిద్ధం అయ్యిందని తెలిపింది. ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ సహాయాన్ని నిలిపివేయడానికి మద్దతుగా ఈ ఏడాది జులైలో వంద మందికి పైగా డెమొక్రాట్లు ఓటు వేశారని నివేదించింది. అయినప్పటికీ రిపబ్లికన్ చట్టసభ సభ్యులు ఇజ్రాయెల్‌కు విస్తృతంగా మద్దతు ఇస్తూనే ఉన్నారని చెప్పింది. కాగా, అమెరికా ఆయుధాగారంలో ఉన్న అత్యంత విధ్వంసకరమైన బాంబుల్లో ఎంకే-84 ఒకటి. ఇది పేలిందంటే పెద్ద లోహపు శకలాలు వేలాది అడుగుల దూరంలో ఎగిరిపడే అవకాశం ఉంది. అలాగే ఈ బాంబు దృఢమైన నిర్మాణాలను సైతం పేల్చేయగలదు. ఇజ్రాయెల్ ఈ తరహా బాంబులను లెబనాన్, గాజాలో గతంలో పలు సార్లు ప్రయోగించింది. దాంతో అప్పట్లో బైడెన్ ప్రభుత్వం వాటి డెలివరీని నిలిపిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే డొనాల్డ్ ట్రంప్ రెండో సారి 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిలుపుదలను ఎత్తివేశారు. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి భారీ బాంబులను ఉపయోగించడం వల్ల పౌరుల ప్రాణాలకు తీవ్ర నష్టం జరుగుతుందని మానవ హక్కుల సంఘాలు అప్పట్లో ఆందోళన వ్యక్తం చేశాయి. అయినా ట్రంప్ వెనక్కి తగ్గలేదు. అయితే గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ సైనిక చర్యల నేపథ్యంలో ఈ ప్రతిపాదిత ప్యాకేజీ సిద్ధమవ్వడం గమనార్హం. కాగా, ఇజ్రాయెల్ రక్షణ అవసరాలకు అమెరికా మొదటి నుంచి అండగా ఉంటోంది. కాగా.. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు ఏడు అరబ్ దేశాలకు చెందిన అత్యున్నత స్థాయి సైనికాధికారులు జర్మనీలో రహస్యంగా సమావేశమయ్యారు. ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం, ప్రాంతీయ భద్రత, హూతీల దాడులు, హర్ముజ్ జలసంధి పరిస్థితులపై ఈ భేటీలో చర్చించినట్లు అని ఆక్సియోస్ నివేదిక వెల్లడించింది. అమెరికా సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌తో పాటు సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఈజిప్ట్‌కు చెందిన సైనికాధికారులు ఇందులో పాల్గొన్నారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967